
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
ఆదివారం 26 అక్టోబరు 2025



ర్యాక్ పాయింట్ నుంచి యూరియా పంపిణీ

చింతకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు 2,518 మెట్రిక్ టన్నుల కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ యూరియా శనివారం పందిళ్లపల్లి ర్యాక్ పాయింట్‌కు చేరిందని టెక్నికల్ ఏవో పవన్‌కుమార్ తెలిపారు. ఖమ్మం జిల్లాకు 1,158, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు 810, మహబూబాబాద్ జిల్లాకు 350, సీఆర్‌పీ ఖమ్మానికి 200 మెట్రిక్ టన్నులు యూరియాను ప్రభుత్వం కేటాయించిందన్నారు. దిగుమతి చేసుకున్న యూరియాను జిల్లాలోని సొసైటీలతో పాటు ప్రైవేట్ డీలర్లకు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు.

సండే స్పెషల్
SUNDAY SPECIAL

పాపికొండలు పోయొద్దాం..



పోచవరం వద్ద పర్యాటకుల సందడి



లాంచీ ఎక్కుతున్న పర్యాటకులు

- గోదావరి లోయల్లో ప్రకృతి అందాలను ఆస్వాదిద్దాం
- ఇటీవల ప్రారంభమైన ఈ సీజన్ జలవిహారం
- ఎన్నిసార్లు వీక్షించినా తనివితీరని అందాలు
- ఓ వైపు ఆధ్యాత్మికం.. మరో వైపు ఆహ్లాదం ఇక్కడి ప్రత్యేకం

పాపికొండలు యాత్ర.. గోదావరి లోయల్లోని ప్రకృతి అందాలను కనుల ఎదుట నిలిపే యాత్ర. గోదావరి అలలపై విహరిస్తూ.. ఆ గుట్టలు, పచ్చని చెట్ల అందాలని వీక్షించాలని ఎవరికి ఉండదు. పైగా రామయ్య దర్శనానికి భద్రాచలం వచ్చే భక్తులు అధిక శాతం మంది పాపికొండలు వెళ్లేందుకు ఆసక్తి చూపుతుంటారు. రెండున్నర దశాబ్దాలుగా ఈ యాత్ర సాగుతున్నా.. పర్యాటకుల తాకిడి మాత్రం తగ్గడంలేదు. ఎన్నిసార్లు వీక్షించినా తనివితీరని అందాలు ఉండటమే ఇందుకు కారణం. ఈ ఏడాది ఈ సీజన్‌కు సంబంధించి పాపికొండలు పర్యటన ఇటీవలే ప్రారంభమవగా ప్రస్తుతం 'మంతా' తుఫాన్ కారణంగా స్వల్ప విరామం ఇచ్చారు. మరోరెండు మూడు రోజుల్లో లాంచీలను నడపనున్నారు. - భద్రాచలం, ఆంధ్రజ్యోతి

6

'ఢీ'సీసీ!



- కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పీఠం కోసం పోటాపోటీ
- ఎవరికి వారే గుట్టుగా ప్రయత్నాలు
- ఢిల్లీ స్థాయిలో కసరత్తు
- ఆ ముగ్గురు ఎవరన్న విషయమై ఉత్కంఠ

ఖమ్మం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : డీసీసీ పీఠాన్ని దక్కించుకునేందుకు ఆశావాహులు ఢీ అంటే ఢీ అంటున్నారు. ఎవరికి వారే గుట్టుగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవి ఎంపిక ప్రక్రియ ఢిల్లీకి చేరింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, తదితరులు ఢిల్లీ చేరుకుని అధ్యక్షుల ఎంపికపై కసరత్తు చేస్తున్నారు ఇప్పటికే ఒక్కో జిల్లా నుంచి ముగ్గురు పేర్లను అధిష్ఠానానికి సిఫార్సు చేసినట్టు సమాచారం. దీంతో ఇటు ఖమ్మం, అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎవరి పేర్లు వెళ్లాయనే దానిపై మిస్టరీ నడుస్తోంది. మొత్తమ్మీద అభ్యర్థుల ఎంపిక ఢిల్లీలో నడుస్తుండడంతో.. జిల్లాలోని కాంగ్రెస్ వర్గాలు ఎవరికి వారు డీసీసీ పీఠంపై దృష్టి పెట్టి పైరవీలు కొనసాగిస్తున్నారు. దరఖాస్తుదారులతో పాటు ఆయా జిల్లాల్లో ప్రత్యేక పరిస్థితులు ఉంటే వర్గాలు, సామాజిక వర్గాలు, సమీకరణలు దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు చేయని వారికి కూడా డీసీసీ పీఠం దక్కే అవకాశం ఉంటుందన్న ప్రచారం కాంగ్రెస్ పార్టీలో నడుస్తోంది. దీంతో ఖమ్మం నుంచి సిట్టింగ్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, భద్రాద్రి నుంచి మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యలు కూడా పార్టీ ఆదేశిస్తే మళ్లీ పార్టీ పగ్గాలు చేపట్టేందుకు సై అంటున్నట్టు సమాచారం. మరో వైపు జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవుల ఎంపికలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సుకు ప్రాధాన్యత ఉంటుందన్న ప్రచారం జరుగుతోంది. ఓసీ, బీసీలకు సంబంధించిన పేర్లను భట్టి అధిష్ఠానానికి సూచించారని భట్టి వర్గీయుల నుంచి ప్రచారం నడుస్తుండగా.. కేంద్ర మాజీ మంత్రి రేణుకా చౌదరి కూడా తన వర్గం నుంచి ఖమ్మం డీసీసీకి ఓసీ, బీసీ పేర్లను అధిష్ఠానం ముందుంచే ప్రయత్నంలో ఉన్నట్టు తెలిసింది. ఆమె కూడా డీసీసీ పీఠం విషయమై ఏఐసీసీతో చర్చించేందుకు ఢిల్లీ వెళ్లే అవకాశం ఉంది. జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పార్టీలో ఎంతో కాలంగా పనిచేస్తున్న వారికే డీసీసీ పీఠం ఇవ్వాలని, పార్టీ నిర్ణయమే తన నిర్ణయమని సూచించినట్టు సమాచారం. మరో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా డీసీసీ పీఠం విషయంలో పెద్దగా పట్టుబట్టకపోయినా.. అవకాశం ఉంటే తన అనుచరుల పేర్లను పరిశీలనలోకి తీసుకోవాలని.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎమ్మెల్యేల అభిప్రాయం ప్రకారం డీసీసీ పదవిని ఎంపిక చేయాలని సూచించినట్టు తెలిసింది. అయితే దరఖాస్తు చేసుకోని వారి పేర్ల విషయంలో కూడా ఏఐసీసీ అడిగితే సమన్వయంగా కొన్ని పేర్లు తెరపైకి వచ్చే అవకాశం కనిపిస్తోంది. మొత్తమ్మీద జిల్లా కాంగ్రెస్ వ్యవహారంపై అధిష్ఠానం చర్చలు సాగిస్తున్నా.. ఖమ్మం డీసీసీ పీఠం అందరితో పాటు తేలుతుందా!? మరికొంత కాలం పడుతుందా!? అన్న విషయమై చర్చ నడుస్తోంది. గతంలో కూడా రాష్ట్రంలో అన్ని డీసీసీల నియామకాలు జరిగినా.. ఖమ్మం డీసీసీ ఎంపిక తీవ్ర జాప్యం తర్వాత అధిష్ఠానం ప్రకటించింది. ఇప్పుడు కూడా ఇదే పరిస్థితి పునరావృతం అయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

అయ్యో.. ఎక్సైజ్!

- ఉమ్మడి జిల్లాలో ఎక్సైజ్ శాఖకు ఏటా రూ.కోట్లల్లో ఆదాయం
- అయినా సొంత భవనాలు కరువు
- ఇరుకు గదుల్లోనే విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్నా.. పట్టించుకునేవారు కరువు

6

ఎవరైనా నిస్సహాయ పరిస్థితిలో ఉన్న వారిని చూస్తే.. అయ్యో పాపం అని అంటాం! కానీ 'అయ్యో.. ఎక్సైజ్' ఏంటని అంటారా!? రూ.కోట్లల్లో ఆదాయం వచ్చే ఆ శాఖ సిబ్బందికి వచ్చిన బాధేంటి !? అని అనుకుంటున్నారా !? ఆదాయం సరే.. కానీ అందులో పని చేసే సిబ్బంది అద్దె భవనాల్లో, అదీ ఇరుకు గదుల్లో పడే అవస్థలు.. తనిఖీల్లో పట్టుబడిన మద్యం, బెల్లం మధ్యే ఉంటూ.. భరించలేని దుర్వాసన నడుమ విధులు నిర్వర్తిస్తుండడాన్ని చూస్తే మీరు కూడా 'అయ్యో.. ఎక్సైజ్' అని అనాల్సిందే..!!



అద్దె భవనంలో ఇల్లెందు ఎక్సైజ్ కార్యాలయం

ఇల్లెందు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఖజానాకు ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏటా ఎక్సైజ్ శాఖ ప్రతీయేడు వందలాది కోట్ల రూపాయల ఆదాయం సమకూరుస్తున్నప్పటికీ.. ఎక్సైజ్ కార్యాలయాలకు మాత్రం ఇప్పటికీ సొంత భవనాలు కరువయ్యాయి. ఉమ్మడి జిల్లా పరిధిలో ఎక్సైజ్ శాఖకు 13 సర్కిల్ కార్యాలయాలు ఉండగా.. కేవలం మూడు మాత్రమే సొంత భవనాలలో కొనసాగుతున్నాయి. మిగతా చోట్ల అద్దె భవనాల్లో ఉంటూ ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. తాజాగా ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు స్వీకరించిన దరఖాస్తుల ద్వారానే ఖమ్మం జిల్లాలో రూ:132.90కోట్ల ఆదాయం లభించగా.. భద్రాది కొత్తగూడెం జిల్లాలో రూ:117.66కోట్ల ఆదాయం లభించింది. రెండు జిల్లాల పరిధిలో మద్యం దుకాణాల దరఖాస్తుల ద్వారానే రూ:250.56కోట్ల ఆదాయం ఎక్సైజ్ శాఖ గడించినప్పటికీ.. ఆ శాఖాధికారులు మాత్రం అరకొర వసతులతో కూడిన అద్దె భవనాల్లోనే కార్యాలయాలు నెట్టుకొస్తుండడం గమనార్హం. దరఖాస్తుల ద్వారానే కాకుండా ప్రతీ నెల ఉమ్మడి జిల్లా పరిధిలోని 204 మద్యం షాపుల ద్వారా వేల కోట్ల ఆదాయం ఎక్సైజ్ ఖజానాకు చేరుతోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సర్కిల్ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాటు చేయక పోవడంతో పాటు సిబ్బందికి క్వార్టర్లు కూడా నిర్మించడం లేదన్న నిర్వేదంలో అధికారులు కూరుకు పోతున్నారు.

ఉమ్మడి జిల్లాలో మూడు సర్కిళ్లకే సొంత భవనాలు

ఏటా వేల కోట్ల ఆదాయం గడిస్తున్న ఎక్సైజ్ శాఖకు ఉమ్మడి జిల్లాలో కేవలం మూడు సర్కిళ్లలోనే సొంత భవనాలు ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భద్రాచలం, పాల్వంచ, ఖమ్మం జిల్లాలో ఖమ్మం-1సర్కిల్ మాత్రమే కార్యాలయాలకు సొంత భవనాలు ఉన్నాయి. మిగిలిన 10సర్కిల్ కేంద్రాల్లో సొంత భవనాలు లేక స్థానికంగా నివాస గృహాలను అద్దెకు తీసుకొని వాటిలో ఎక్సైజ్ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఫలితంగా చాలీచాలని వసతులు, రూముల మూలంగా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. తనిఖీల్లో పట్టుబడిన మద్యం, బెల్లం మధ్యే ఉంటూ.. వాటి భరించలేని దుర్వాసన నడుమ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది కార్యాలయాల్లోని ఇరుకు గదుల్లో విధులు నిర్వర్తిస్తుండడం గమనార్హం. అలాగే తనిఖీల సందర్భంగా పట్టుబడిన, స్వాధీనం చేసుకున్న వాహనాలు ఆరు బయటే అద్దె భవనాల ఎదుట ఉంచుతుండడం.. అవి ఎండకు ఎండి, వానకు తడిసి శిథిలం అవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి.

పునాదుల దశలోనే నిలిచిన భవన నిర్మాణాలు

కొద్ది సంవత్సరాల క్రితం ఎక్సైజ్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలన్న యోచనతో.. అధికారులు ఆ ప్రక్రియను ప్రారంభించారు. కానీ ఐదు సర్కిల్ కార్యాలయాల భవనాల నిర్మాణం బేస్‌మెంట్‌ల స్థాయిలోనే నిలిచిపోయింది. ఫలితంగా పిచ్చిచెట్లు పొదల స్థాయిలో నిలిచిపోయి దర్శనం ఇస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, మణుగూరు, ఖమ్మం జిల్లాలో నేలకొండపల్లి, మధిర, సత్తుపల్లి, కారేపల్లి సర్కిల్ కార్యాలయాల భవన నిర్మాణాలు చేపట్టి ఏళ్లు కావస్తున్నా.. ఇప్పటికీ పూర్తి కావడం లేదు. మూడేళ్ల క్రితం కారేపల్లిలో రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో రూ. 15లక్షల వ్యయంతో నిర్మాణం ప్రారంభించిన ఎక్సైజ్ కార్యాలయం పనులకు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు నిలిపివేసిన పట్టించుకునే నాథుడే (మిగతా 6వ పేజీలో)

పురపాలికల్లోనూ..

- పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- రేపు కల్లూరులో ప్రారంభం.. ఆ తర్వాత దశల వారీగా మిగిలిన చోట్ల
- జిల్లా వ్యాప్తంగా 136 ఎస్‌హెచ్‌జీలకు ఉపాధి
- గతేడాది ఖమ్మంలో పైలెట్ ప్రాజెక్టుగా అమలు



ధాన్యం కొనుగోలు కేంద్రం(ఫైల్)

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): టీ క్యాంటీన్లు మొదలు.. పెట్రోల్ బంకుల నిర్వహణ వరకు పలు వ్యాపారాల్లో ముందు వరసలో ఉన్న మహిళా సంఘాలు.. ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ ధాన్యం కొనుగోలుకు సై అంటున్నాయి. ఇతర ప్రభుత్వ శాఖల కంటే ముందుగానే కొనుగోలుకు ముందుకు వచ్చాయి. ఇప్పటి వరకు గ్రామీణ ప్రాంతాల్లో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సెర్ప్ పరిధిలోని మహిళ సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా కొనుగోలు చేశారు. అయితే ఖమ్మం నగరం మినహా పట్టణాలు, మున్సిపాలిటీల్లో కొనుగోలు కేంద్రాలు లేక పోవటంతో సమీప ప్రాంతాల రైతులు ఇబ్బందులు పడుతూ.. ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. అయితే సోమవారం నుంచి ఖమ్మం జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లోనూ ధాన్యం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. తద్వారా మరో వైపు పట్టణ మహిళా సంఘాలకు నెల రోజులు పాటు ఉపాధి కూడా దక్కనుంది.

గతేడాది పైలెట్ ప్రాజెక్టుగా..

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) పరిధిలో 2024లో పైలెట్ ప్రాజెక్టుగా ఖమ్మంలోని గోపాలపురం, కైకొండాయిగూడెం, రామన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి.. లక్ష్యాల కంటే అధికంగా కొనుగోలు చేశారు. గోపాలపురంలో 2వేల క్వింటాలు, కైకొండాయిగూడెంలో 1500 క్వింటాలు, రామన్నపేటలో 600 క్వింటాల వడ్లను కొన్నారు. ప్రభుత్వం కూడా క్వింటా ధాన్యం కొనుగోలుకు ఎస్‌హెచ్‌జీకి రూ.32 కమీషన్‌గా ప్రకటించింది. ఇలా వచ్చిన కమీషన్‌లో సమాఖ్యకు 60శాతం మిగిలిన 40శాతం పనిచేసిన సభ్యులకు అందిస్తారు. ఖమ్మంనగరంలో నిర్వహించిన ధాన్యం కొనుగోలు కేంద్రంలోని ఒక్కో సభ్యురాలికి నెల రోజులు పనిచేసినందుకు రూ.15వేల నుంచి రూ.20వేల వరకు ఆదాయం వస్తుంది. కానీ ప్రభుత్వం నుంచి నేటికీ ఆ కమీషన్ డబ్బులు విడుదల కాకపోవడం గమనార్హం.

సోమవారం నుంచి అన్ని మునిసిపాలిటీల్లో

మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల్లో దాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించనున్నారు. సోమవారం కల్లూరు మున్సిపాలిటీలోని కల్లూరు, పుల్లయ్యబంజరలో ప్రారంభించనున్నారు. ఆ తర్వాత వైరా మునిసిపాలిటీలోని సోమవరం గ్రామంలో, మధిర మున్సిపాలిటీలోని మార్కెట్‌యార్డు, ఖమ్మం నగరంలో గోపాలపురం, కైకొండాయిగూడెం, రామన్నపేట, దానవాయిగూడెంలో దశల వారీగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంబించనున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్ని మునిసిపాలిటీల్లో 136మహిళా స్వయం సహాయక సంఘాలకు ప్రత్యక్షంగా ఉపాధి దొరకనుంది. పుల్లయ్యబంజర లాంటి కొనుగోలు కేంద్రాల్లో సభ్యులకు రూ.వేలల్లో ఆదాయం రానుంది. మునిసిపాలిటీల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పదిహేనురోజులుగా మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ నళినీప్రసాద్, డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతారాణి ఆధ్వర్యంలో కసరత్తు జరుగతోంది. ఇప్పటికే సమావేశాలు నిర్వహించి సంఘాలకు అవగాహన కల్పించారు. ఇతర ప్రభుత్వశాఖల కంటే ముందుగానే ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు కార్యచరణ పూర్తి చేశారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగుల చవితి పండుగను జిల్లా ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. సౌభాగ్యానికి, సంతానప్రాప్తికి సర్పపూజ నిర్వహించారు. కుజ, రాహుదోషాలున్నవారు, బాధలున్నవారికి శుభం కలుగుతుందనే నమ్మకంతో పుట్టలో పాలుపోసి పూజలు నిర్వహించారు. నగరంలోని ఖానాపురం విద్యుత్ సబ్‌స్టేషన్, స్థంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయంతోపాటు నగరంలోని పలు శివాలయాలు, సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి పాలాభిషేకాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శనివారం రాత్రి జాగారం చేసే వారు ఆదివారం తెల్లవారుజామున పుట్టలో సద్ది పాలు పోసి ఒక్కపొద్దులను విరమిస్తారు.



ఖమ్మంలో పుట్ట వద్ద పాలుపోస్తున్న భక్తులు

పఠనా సామర్థ్యాలను పెంపొందించాలి



- 'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమం అమలు
- విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్‌ను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలి
- వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

6

వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సండే స్పెషల్ SUNDAY SPECIAL

» గోదావరి లోయల్లో ప్రకృతి అందాలను ఆస్వాదిద్దాం
» ఇటీవల ప్రారంభమైన ఈ సీజన్ జల విహారం
» ఎన్నిసార్లు వీక్షించినా తనివితీరని అందాలు
» ఓ వైపు ఆధ్యాత్మికం.. మరోవైపు ఆహ్లాదం ఇక్కడి ప్రత్యేకం

పాపికొండలు.. పోయొద్దాం..



లాంచీలో లైఫ్‌జాకెట్లతో పర్యాటకులు



పాపికొండలు పేరంటాలపల్లి విహార యాత్ర సాగేదిలా



పాపికొండల మధ్య గోదావరి అందాలు

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భద్రాద్రి సీతారామచంద్రస్వామి దర్శనానికి తరలొచ్చే భక్తులతో పాటు పర్యాటకులకు ఆధ్యాత్మికంతో పాటు.. ఆహ్లాదాన్ని అందించేందుకు జాతీయ స్థాయిలో పేరొందిన పాపికొండలు- పేరంటాలపల్లి విహారయాత్ర మళ్లీ అందుబాటులోకి వచ్చింది. గత రెండున్నర దశాబ్దాలుగా గోదావరిపై బోటులో జలవిహారం పిల్లలను, పెద్దలను ఎంతగానో ఆకర్షిస్తోంది. ఈ క్రమంలో తెలుగు రాష్ట్రాలనుంచే కాకుండా దేశం నలుమూలల నుంచి ఈ అందాలను కనులారా వీక్షించేందుకు పర్యాటకులు ఎంతో ఆసక్తి కనబరుస్తుంటారు. తొలి నాళ్లలో వారాంతపు సెలవుల్లోనే సాగిన ఈ యాత్ర కాల క్రమేణా ప్రతీరోజు నిర్వహిస్తుండగా యాత్రికుల నుంచి విశేషస్పందన లభిస్తోంది. ప్రస్తుతం 22బోట్లు పర్యాటకులకు అందుబాటులో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌కు సంబంధించి లాంచీలు ఇటీవలే అధికారికంగా పునఃప్రారంభమయ్యాయి. ఈ పర్యటన కొత్తది కాకపోయినా ఏటా ఉండేదే అయినా ప్రకృతిప్రేమికులు మాత్రం తరచూ వచ్చేందుకు ఇష్టపడుతుంటారు. అందువల్లే పాపికొండలు పర్యటనకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది.

● ఎలా చేరుకోవాలంటే..

ఏపీలోని అల్లూరి జిల్లా వరరామచంద్రాపురం మండలం పోచవరం నుంచి ప్రారంభమయ్యే పాపికొండలు-పేరంటాలపల్లి విహారయాత్రకు వెళ్లే వారు హైదరాబాద్ నుంచి వచ్చేవారు భద్రాచలం రావాలి. రామయ్య దర్శనం అనంతరం 70 కిలోమీటర్లు రోడ్డుమార్గంలో ఉదయం 9గంటల లోపు పోచవరానికి చేరుకోవాల్సి ఉంటుంది. అక్కడి నుంచి లాంచీలు ప్రారంభమవుతాయి.

● టికెట్ బుకింగ్ ఇలా

విహార యాత్రకు వెళ్లేవారు భద్రాచలంలో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కౌంటర్లలో టికెట్లను కొనుగోలు చేయవచ్చు. పెద్దలకు రూ.950, పిల్లలకు రూ.750 తీసుకుంటున్నారు. పర్యాటకశాఖ బోట్లకు మాత్రం ఆన్‌లైన్ అవకాశం కూడా అందుబాటులో (టీఎస్‌బోట్‌టూరిజం వెబ్‌సైట్) ఉంచారు. టికెట్ తీసుకున్న వారు సొంతవాహనాల్లో పోచవరానికి చేరుకోవచ్చు లేదంటే నిర్వాహకులు ప్రత్యేక వాహనాలను కూడా సమకూర్చుతారు. వాటికి ప్రత్యేక రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

● ఆధార్ జిరాక్స్ తప్పనిసరి.. మద్యానికి నో ఛాన్స్

పాపికొండలు విహార యాత్రకు వెళ్లేవారు తమ వెంట తప్పకుండా ఆధార్ జిరాక్స్ ఉండాలి. ఇది లేకపోతే యాత్రకు అనుమతించరు. ఆధార్ జిరాక్స్‌ను అక్కడి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది. అలాగే విహార యాత్రకు వెళ్లేవారు తమ వెంట మద్యాన్ని తీసుకెళ్లేందుకు అనుమతి లేదని బోటు నిర్వాహకులు స్పష్టం చేస్తున్నారు. ఈ క్రమంలో పోచవరం వద్ద బోటుఎక్కే సమయం లో పోలీసు, రెవెన్యూ, నీటిపారుదలశాఖ, అటవీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించిన అనంతరమే బోటులోకి అనుమతిస్తారు. ఒకవేళ తనిఖీల సమయంలో ఎవరి వద్దయినా మద్యం సీసాలు లభ్యమైతే స్వాధీనం చేసుకొని.. విహార యాత్ర ముగిసిన అనంతరం సంబంధిత వ్యక్తులకు అందజేస్తారని నిర్వాహకులు చెబుతున్నారు. ఇక బోటులోకి వెళ్లిన వారు తమ సీట్లలో కూర్చొనే ముందు లైఫ్ జాకెట్లను తప్పనిసరిగా ధరించాల్సి ఉంటుంది.

● విహారయాత్ర సాగుతుందిలా..

పోచవరం దగ్గర ఉదయం 9 గంటలకు బోట్లో ఎక్కిన పర్యాటకులను తొలుత పేరంటాలపల్లికి తీసుకెళ్తారు. అక్కడ శ్రీరామకృష్ణ మునివాటం ఆలయ సందర్శన అనంతరం తిరిగి పాపికొండలకు తీసుకెళ్తారు. ఈ సమయంలోనే వారికి భోజన ఏర్పాట్లు చేస్తారు. సాయంత్రం 4నుంచి ఐదు గంటల మధ్యలో తిరిగి పోచవరం చేరుకునేలా చూస్తారు. అంతకు ముందు పర్యాటకులు బోటు ఎక్కిన అనంతరం తొలుత వారు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై వివరిస్తారు. అలాగే విహార యాత్ర సాగే సమయంలో ఆయా ప్రాంతాలకు సంబంధించిన విషయాలను తెలియజేస్తారు. అలాగే ఆట విడుపుగా చిన్న పిల్లలతో ఆటలు, పాటలు ఉంటాయి. బోటులో ప్రయాణం చేసే వారికి ఉదయం అల్పాహారం, టీ ఇస్తారు. మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందజేస్తారు.

తుఫాన్ నేపథ్యంలో తాత్కాలిక బ్రేక్

ప్రస్తుతం మంతా తుఫాన్ నేపథ్యంలో పోచవరం నుంచి సాగే పాపికొండలు పేరంటాలపల్లి విహార యాత్రకు తాత్కాలిక బ్రేకు పడింది. ఈ మేరకు చింతూరు ప్రాజెక్టు అధికారి, సబ్‌కలెక్టర్ శుభమ్ నొక్వాల్ అధికారిక ఆదేశాలు జారీ చేశారు. తుఫాన్ తగ్గిన అనంతరం విహార యాత్ర కొనసాగనుంది.

పఠనా సామర్థ్యాలను పెంపొందించాలి

'ఎవ్రీ చైల్డ్ రీడ్స్' కార్యక్రమం అమలు
విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్‌ను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలి
వీడియో కాన్ఫరెన్స్‌లో ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నూరుశాతం పఠన సామర్థ్యాలను పెంపొందించేలా కృషిచేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. దీనికోసం అక్టోబర్ 27 నుంచి ఎవ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శనివారం విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని అక్టోబరు 27 నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల సమయంలో మాత్రమే ఈ కార్యక్రమాన్ని అమలు చేసేలా రూపొందించినట్లు తెలిపారు. ప్రతి రోజు గంట సమయం ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థుల రీడింగ్ స్కిల్స్ పెంచేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. రోజు మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల వరకు గంట సేపు పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి చదివే పిల్లలకు ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని అమలుచేయాలన్నారు. దీనిలో ప్రతి ఉపాధ్యాయుడే భాగస్వామ్యం కావాలన్నారు. ఇంగ్లీషుపై ఫొనెటిక్స్ బేసిక్‌గా ఈ కార్యక్రమాన్ని రూపొందించామని ప్రతి ఇంగ్లీషు అక్షరం ఏటువంటి సౌండ్ చేస్తుంది అనేది విద్యార్థులకు తెలియజేసేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలన్నారు. చిన్నచిన్న పదాలతో ఫోనేటిక్ సౌండ్ నేర్పించాలన్నారు. ప్రతి అక్షరం ఏం సౌండ్ చేస్తుందీ అనే అంశాన్ని పిల్లలకు స్పష్టంగా ఉపాధ్యాయులు నేర్పించాలన్నారు. సులువైన పదాలతో ప్రారంభించి సరళంగా ఇంగ్లీషు చదివే సామర్థ్యాన్ని పెంపొందించేలా మెటీరియల్ తయారు చేసినట్లు కలెక్టర్ వెల్లడించారు. ప్రతి రోజూ టీచర్ యాక్టివిటీ, స్టూడెంట్ యాక్టివిటీ స్టోరీ చెబుతూ పిల్లలను ఇంటరాక్ట్ చేస్తూ కార్యక్రమాన్ని అమలుచేయాలన్నారు. ప్రతి రోజు పిల్లలకు నేర్పే పదాలను వినియోగిస్తూ స్టోరీలను అందించామని పదాలు నేర్పిన తర్వాత పిల్లలతో ఆ స్టోరీలు చదివించాలన్నారు. పిల్లలకు చదవడం, నేర్పే సమయంలో ప్రతి అక్షరం ఏ సౌండ్ చేస్తుందో తెలియచేయాలన్నారు. ఎవ్రీ చైల్డ్ రీడ్ కార్యక్రమాన్ని నెలరోజుల పాటు అమలుచేస్తే ప్రతి విద్యార్థికీ చదివే సామర్థ్యం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలన్నారు. జిల్లాలో ఎంతో మంది ఉత్తమ ఉపాధ్యాయులు ఉన్నారని కొంచెం దృష్టి సారిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ సూచించారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ సీహెచ్ రామకృష్ణ, సీఎంవో ప్రవీణ్, ఆర్‌ఎంవో ప్రభాకర్‌రెడ్డి, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ జాబితాను పకడ్బందీగా తయారు చేయాలి

అధికారులకు సూచించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి
ఉమ్మడి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భద్రాద్రి కలెక్టర్

కొత్తగూడెం కలెక్టరేట్/ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎస్.ఐ.ఆర్ ఓటర్ జాబితా పకడ్బందీగా తయారు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియోకాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు భద్రాద్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ జితేష్ వి. పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ నిర్వహణ కోసం చేపట్టిన ప్రిపేరేటరీ కార్యచరణలో పురోగతి ఉండాలని 2002లో చేసిన ఎస్.ఐ.ఆర్‌తో 2025 స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ జాబితా మ్యాపింగ్ ప్రక్రియను బూత్‌స్థాయి అధికారుల సహకారం తీసుకుని వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ఎస్.ఐ.ఆర్ నిర్వహణ కంటే ముందు ప్రతీ పోలింగ్ బూత్ స్థాయిలో 2002 ఎస్.ఐ.ఆర్ డేటాను 2025 ఎస్.ఐ.ఆర్ డేటాతో కంపేర్ చేసుకోవాలన్నారు. ఈ రెండు జాబితాలో కామన్‌గా ఉన్న పేర్లు మినహాయించి 2002 తర్వాత ఓటరుగా నమోదైన వారి వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధృవీకరించాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం కలెక్టర్ జితేష్ వి.పాటిల్ మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్‌లో భాగంగా క్యాటగిరి ఏని బీఎల్వో యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరి సీ, డీ లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఈఆర్‌వో కార్యాలయంలో ఇద్దరు బూత్‌స్థాయి అధికారులను ప్రత్యేకంగా కేటాయించి శనివారం నాటికి మ్యాపింగ్ పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య, ఎలక్షన్ సెల్ సూపరెంటెండెంట్ రంగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కలెక్టరేట్ నుంచి..

కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి ఈ వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఐఆర్ మ్యాపింగ్‌లో భాగంగా క్యాటగిరి 'ఏ'ని బీఎల్వో యాప్ ద్వారా ధృవీకరిస్తామని, క్యాటగిరి సీ, డీ లింక్ ప్రక్రియ పూర్తి చేస్తామని అన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి జి.నరసింహారావు, తహసీల్దార్లు అరుణ, శ్రీనివాసరావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు.



క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీస్తున్న దృశ్యం (ఫైల్)

ఆ ఘోర ప్రమాదం గుర్తొచ్చింది..

2016లో నాయకన్‌గూడెం వద్ద సాగర్ కాల్వలో ట్రావెల్స్ బస్సు బోల్తా
నాటి ఘటనలో 10 మంది దుర్మరణం

కూసుమంచి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు కర్నూలు వద్ద అగ్ని ప్రమాదానికి గురై.. 20మంది సజీవదహనమైన విషయం తెలుగురాష్ట్రాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన గురించి తెలుసుకున్న ఖమ్మం జిల్లా వాసులు ముఖ్యంగా కూసుమంచి మండల ప్రజలు 2016 ఆగస్టు 22వ తేదీన తెల్లవారుజామున 2:40గంటల సమయంలో హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అదుపుతప్పి కాలువలో పడింది. ఈ ఘటనలో 10మంది మృతిచెందగా, 16మంది గాయపడ్డారు. డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ ప్రమాదాన్ని స్థానికులు ఇంకా మరిచిపోలేదు. అదేవిధంగా ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిలో నాయకన్‌గూడెం వద్ద 2023 జూన్‌లో హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళుతున్న మరో ట్రావెల్స్ బస్సు హైవేపై ప్రమాదవశాత్తు బోల్తాపడింది. ఈఘటనలో ఐదుగురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్యాయత్నం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ



ఇసుక ట్రాక్టర్‌ను అడ్డుకుంటున్న దృశ్యం

» పోట్లపల్లి గ్రామ పంచాయతీ ఉలవలచెలకలో ఘటన
» ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక తోలకాలను అడ్డుకుంటున్నందుకేనని ఆరోపణ

పినపాక, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోట్లపల్లి గ్రామపంచాయతీ ఉలవలచెలక గ్రామానికి చెందిన మలకం కోటమ్మ అనే మహిళ శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఘటనకు సంబంధించి కోటమ్మ భర్త విశ్వనాథం, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోట్లపల్లి గ్రామపంచాయతీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పంచాయతీ అధికారులు ఇచ్చిన కూపన్‌లతో ఇసుకను తోలేందుకు ఉలవలచెలక గ్రామం వద్ద ఉన్న పెద్దవాగుకు మలకం కోటమ్మ వెళ్లింది. అయితే ఉలవలచెలక గ్రామానికి చెందిన ఓ పార్టీ నాయకులు ఆమెను అడ్డుకున్నారు. ఇసుక తోలకాల వల్ల దుమ్మూధూళి లేస్తుందని, రోడ్లు పాడవుతున్నాయని.. అందుకే ఇసుకను తోలేందుకు వీల్లేదంటూ దౌర్జన్యంగా ట్రాక్టర్‌ను అడ్డుకున్నారు. తమకు అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పినా వినకుండా ఎలా తోలుతారో చూస్తామంటూ, గొడవకు దిగారని కోటమ్మ భర్త విశ్వనాథం తెలిపారు. గ్రామంలో ఇసుక తోలకాలు జరిగితే, ఇందిరమ్మ ఇళ్లు పూర్తవుతాయనే అక్కసుతో, కావాలనే ఓ పార్టీకి చెందిన కొందరు నాయకుల ప్రోద్బలంతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. దీంతో సదరు మహిళ కోటమ్మ తీవ్ర మనస్థాపానికి గురైనట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఇంటికెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిందని భర్త విశ్వనాధం ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కోటమ్మను పినపాక ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం మణుగూరు 100 పడకల ఆసుపత్రికి తరలించారు. కాగా.. జరిగిన ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్టు విశ్వనాధం తెలిపారు. తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.



సీపీఐ వందేళ్ల ఉత్సవాల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

సీపీఐ వందేళ్ల ఉత్సవాల జయప్రదానికి కదలిరండి

గడపగడపకూ శతవసంత ఉత్సవాల సమాచారం చేరవేయాలి
సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి) : దేశ స్వతంత్ర పోరాటం నుంచి పురుడు పోసుకుని ఎన్నో నిర్బంధాలు ఎదుర్కొని నవభారత నిర్మాణంలో ప్రధాన భూమిక పోషించిన భారత కమ్యునిస్టు పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరుగుతున్న శత వసంతోత్సవాలకు అన్ని వర్గాల ప్రజలు తరలిరావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్‌పాషా కోరారు. డిసెంబర్ 26న ఖమ్మం నగరంలో జరగనున్న జాతీయ స్థాయి ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. పట్టణంలోని రామవరం ఏరియా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబీర్‌పాషా మాట్లాడుతూ.. వందేళ్ల ఉత్సవాలకు ఖమ్మం నగరం వేదికవుతుందన్నారు. 40దేశాలకు చెందిన ప్రతినిధులు, వివిధ రాష్ట్రాలకు చెందిన కమ్యునిస్టు ప్రముఖులు ఈ ఉత్సవాల బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. జిల్లా నుంచి లక్ష మందిని తరలించేందుకు లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా జరిగే కార్యక్రమం విజయవంతం కోసం అన్ని వర్గాల ప్రజలు తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, ఎస్‌కె. ఫహీమ్, జిల్లా కౌన్సిల్ సభ్యులు భూక్యా శ్రీనివాస్, మునిగడప వెంకటేశ్వర్లు, పద్మ, నాయకులు గోపికృష్ణ, డబ్బెట్టి గురుమూర్తి, పాటి మోహన్, గుత్తుల శ్రీనివాస్, గుగులోత్ నగేష్, తూముల శ్రీనివాస్ ఖయూమ్, జలీల్ కృష్ణ, బాలాజీ, కోరిమి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మరమ్మతు పనులు చేపడుతున్న దృశ్యం

భద్రాచలం-చర్ల రహదారికి మరమ్మతులు

ఎమ్మెల్యే తెల్లం చొరవతో పనులు
టీఎస్ఎండీసీ నిధులు రూ.30 లక్షల కేటాయింపు

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలం-చర్ల రహదారి పూర్తిగా పాడైపోవడంతో శనివారం నుంచి తాత్కాలిక మరమ్మతు పనులు చేపడుతున్నారు. టీఎస్ఎండీసీ కేటాయించిన రూ.30 లక్షల నిధులతో ఏపీలోని యటపాక నుంచి చర్ల వరకు రోడ్డు మరమ్మత్తులను నిర్వహిస్తున్నారు. ఇటీవల కన్నాయిగూడెంలో ఇసుక లారీలు తిరగొద్దని రెండు రోజుల పాటు ధర్నా నిర్వహించడంతో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు టీఎస్ఎండీసీ అధికారులతో మాట్లాడారు. పూర్తిగా పాడైపోయిన రహదారిని పునరుద్ధరించిన అనంతరమే లారీలను తిప్పాలని కోరడంతో టీఎస్ఎండీసీ నిధులను కేటాయించింది. అనంతరమే ఇసుక లారీలను మళ్లీ ప్రారంభించనున్నారు. దీంతో రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి.

అయ్యో.. ఎక్సైజ్!

(5వ పేజీ తరువాయి)

కరువయ్యాడు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆశ్వారావుపేట, వైరా, ఖమ్మం 2, ఇల్లెందు పట్టణంలో సర్కిల్ కార్యాలయాల భవనాల నిర్మాణం ఊసే లేదు. ఇల్లెందులో భవన నిర్మాణానికి స్థలం కేటాయించినప్పటికీ.. నిధులు విడుదల చేయకపోవడంలో నిర్మాణం ప్రారంభించ లేదు. ఫలితంగా ఎక్సైజ్ శాఖ స్థలం ఏ క్షణంలో కబ్జాకు గురవుతుందో చెప్పలేని పరిస్థితి నెలకొంది. ఏదేమైనా యేటా వేల కోట్ల ఆదాయం సమకూరుస్తున్న ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాలకు సొంత భవనాలు లేకపోవడం, తనిఖీలకు వెళ్లేందుకు వాహనాలు లేకపోవడం, సిబ్బందికి కనీస సౌకర్యాలు కల్పించకపోవడం చర్చనీయాంశం అవుతోంది.

పత్తి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి

సుజాతనగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యన్నారాయణ అన్నారు. మండలంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన తెలంగాణ రైతు సంఘం మండల మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వర్షాకాలం సీజన్ నుంచి ఇప్పటి వరకు ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల వల్ల పత్తి పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. దెబ్బతిన్న పత్తి రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలన్నారు. రైతు ఒక ఎకరానికి రూ. 50 వేల నుంచి రూ. 60 వేల దాకా పెట్టుబడి పెట్టారని, చివరకు చేతికొచ్చిన ఆ కొంచెం పత్తి కూడా అధిక వర్షాల వల్ల దెబ్బతిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా తడిసిన పత్తిని కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వంశీ కృష్ణ, సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కున్సోత్ ధర్మా, కాట్రాల తిరుపతిరావు, బచ్చలకూర శ్రీనివాస్, బాలు వెంకటేశ్వర్లు, భూక్యా శంకర్, నల్లగోపు పుల్లయ్య, లిక్కి నాగరాజు, ఊడుగుల శ్రీకాంత్, గుగులోత్ జగన్, కున్సోత్ కిషన్, ఏడుకొండలు, మేకల శంకర్, దొడ్డి సత్యనారాయణ, గడ్డం సురేందర్, గుగులోత్ దేవిజా, గుగులోత్ రత్న పాల్గొన్నారు.

వృద్ధుడి హత్య కేసులో నిందితుడి రిమాండ్

» పరారీలో మరో ముగ్గురు
» కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

చుంచుపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): మర్రిగూడెం హత్య కేసులో ఒక నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. శనివారం ఆయన కేసుకు సంబంధించి విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 22వ తేదీన రాత్రి 11 గంటలకు చుంచుపల్లి మండలంలోని పెనగడప గ్రామ పంచాయతీలో గల మర్రిగూడెం ప్రాంతంలో గుత్తికోయ పెద్దం నందయ్య(65)ను హత్య చేయబడ్డాడు. మృతుడు కుమారుడు పెద్దం గౌతమ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన కొత్తగూడెం టూ టౌన్ పోలీసులు ఈ హత్యను నలుగురు వ్యక్తులు కలిసి చేసినట్లు నిర్ధారించారు. వీరిలో ఏ1 పోడియం రాము, ఏ2 తాపర్ల వెంకటేష్, ఏ3 అనిల్, ఏ4 ఉంగయ్యలు నిందితులుగా ఉన్నారు. వీరు మృతుడి ఇంటి ఆవరణలోకి చొరబడి ఈ హత్యకు పాల్పడ్డారు. గతంలో పోడియం రాము కుమారుడు అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా , దానికి కారణం మృతుడు నందయ్య చేసిన చేతబడి మంత్రాలే కారణమంటూ కక్ష కట్టాడు. దీంతో పోడియం రాము మిగతా వారితో కలిసి కర్రలతో, గొడ్డలితో నందయ్యపై దాడి చేసి హత్య చేశారు. అనంతరం మృతుడి శవాన్ని తెల్లవాగులో పడేశారు. విచారణలో భాగంగా తాపర్ల వెంకటేష్‌ను అదుపులోకి తీసుకొని.. అతని వద్ద నుండి మూడు కర్రలను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్టు డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఈ కేసులో ఏ1, ఏ3, ఏ4గా ఉన్న మరో ముగ్గురు నిందితులను పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎస్పీ తెలిపారు.

కేయూ అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ పోటీలో ప్రియదర్శిని విద్యార్థికి ప్రథమ స్థానం

లక్ష్మీదేవిపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శనివారం జరిగిన అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ (పరుగు పందెం)పోటీలో 10 కిలోమీటర్ల విభాగంలో కొత్తగూడెం ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి మాలోత్ అఖిల్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. త్వరలో జరగబోయే ఆలిండియా యూనివర్సిటీ పోటీలకు అఖిల్ ఎంపికైనట్టు కళాశాల బాధ్యులు తెలిపారు. ఈ సందర్భంగా అఖిల్‌ను కళాశాల కరస్పాండెంట్ కాటిపల్లి నవీన్ బాబు, డైరెక్టర్ శ్రీరామనేని చలపతిరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నయింపాషా, వైస్‌ప్రిన్సిపాల్ రాయల వివేక్, పీడీ కాశిమల్ల రమేష్‌లు అభినందించారు.



ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థి అఖిల్

దేవాదాయశాఖ కమిషనర్‌కు వేదాశీర్వచనం

కలిసిన దేవస్థానం ఈవో, ప్రధాన అర్చకులు
రామయ్యకు స్వర్ణ తులసార్చన
కాశీ తరలివెళ్లిన వైదిక అధికారుల బృందం

భద్రాచలం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎస్.హరీష్‌ను భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఈవో కె. దామోదర్‌రావు, మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.హరీష్‌కు ముందుగా దేవస్థానం ఈవో దామోదర్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దేవస్థానం వైదిక సిబ్బంది ఆయనకు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సమయంలో దేవస్థానం తరపున శాలువ, స్వామివారి ప్రసాదం ఆయనకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంట ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్ అర్చకులు అమరవాది వెంకట్రామన్ ఉన్నారు.

రామయ్యకు స్వర్ణతులసార్చన

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో శనివారం సందర్భంగా స్వర్ణ తులసార్చన నిర్వహించారు. ఈ సేవలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కాశీలో ఈ నెల 29న జరిగే శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణం నిర్వహించేందుకు వైదిక అధికారుల బృందం తరలివెళ్లారు.


దేవాదాయశాఖ కమిషనర్‌కు వేద ఆశీర్వచనం అందజేస్తున్న దృశ్యం

శ్రీవారి ఆలయ స్థలంలో శ్రమదానం

ప్రతిపాదిత ప్రాంతాన్ని శుభ్రం చేసిన అల్లీపురం ప్రజలు
ఏడుకొండల స్వామి ఆలయ నిర్మాణానికి చొరవ చూపిన
మంత్రి తుమ్మలకు ధన్యవాదాలు తెలిపిన గ్రామస్థులు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని అల్లీపురం గ్రామం 408సర్వే నెంబర్ కొందరాశి గుట్ట వద్ద 20 ఎకరాల్లో నిర్మాణం చేయనున్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రతిపాదిత స్థలంలో ఉన్న చెత్తను తొలిగించేందుకు శనివారం గ్రామస్థులు శ్రమదానం చేశారు. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా టీటీడీ ఆధ్వర్యంలో నిర్మాణం చేయబోయే ఈ ఆలయం తమ గ్రామంలో నిర్మిస్తున్నందుకు హర్షం వ్యక్తంచేస్తూ అల్లీపురం గ్రామస్థులు మూడు వందల మంది గ్రామస్థులు పండుగ వాతావరణంలా ఆ స్థలాన్ని శుభ్రం చేసి శ్రమదానం చేశారు. ఖమ్మం నగరానికి ఐకాన్‌గా శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం చేయాలని పట్టుదలతో టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితో మాట్లాడారు. ఈ


శ్రమదానం చేసేందుకు ముందుకు వచ్చిన గ్రామస్థులు

ఆలయ నిర్మాణం ఖమ్మం నగరంలో చేసేలా మంజూరు చేయించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఈసందర్భంగా అల్లీపురం గ్రామస్థులు అభినందనలు తెలిపారు. గ్రామంలో ఆలయం నిర్మాణం చేస్తున్నందుకు అల్లీపురం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. రావూరి సైదబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు సంక్రాంతి నాగేశ్వరరావు, వునిగల్ నాగేశ్వరరావు, పత్తిపాటి అప్పారావు, వడ్డెప్పుడు మల్లయ్య, సామినేని ముత్తయ్య, ఎర్రబోయిన గోవిందు తదితరులు ఆలయ నిర్మాణ స్థలంలో శ్రమదానం చేశారు.

యువజనోత్సవాలకు యువ కళాకారుల ఎంపికలు

డీవైఎస్‌వో పరంధామరెడ్డి

చుంచుపల్లి, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): 29వ జాతీయ యువజనోత్సవాలు సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాస్థాయి యువ కళాకారుల ఎంపికలు, సైన్స్ మేళాను నవంబర్ 6వ తేదీన కొత్తగూడెం క్లబ్ ఉదయం 9.00గంటల నుండి నిర్వహించబడుతుందని డీవైఎస్‌వో పరందామరెడ్డి శనివారం వివరాలు వెల్లడించారు. ఈ పోటీలలో పాల్గొనే అభ్యర్థుల వయస్సు 15 నుంచి 29 సంవత్సరాలలోపు ఉండాలన్నారు. జిల్లాస్థాయిలో జానపద నృత్యం (గ్రూప్), జానపదగేయాలు (గ్రూప్), కవిత్వం, వ్యాస రచన పోటీలు పెయింటింగ్, సైన్స్ మేళా, వకృత్వ పోటీలు సామూహిక, వ్యక్తిగత ప్రదర్శనలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రథమస్థానం పొందిన కళాకారులను సైన్స్ మేళాలలో ఎంపికైన వారిని రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో ఎంపిక చేసిన ఉత్తమ కళాకారులు వచ్చే ఏడాది జనవరి 12 నుంచి 16వ తేదీ వరకు జరిగే జాతీయస్థాయి యువజనోత్సవాలలో పాల్గొంటారని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన యువతీ, యువకులు వచ్చేనెల 3వ తేదీ లోపు వారి పేరు, వయస్సు, పుట్టిన తేదీ, ఆధార్, అడ్రెస్, ఫోన్ నెంబర్, ప్రదర్శన పేరు మొదలగు వివరములతో అధికారిక డీవైఎస్‌వో వెబ్‌సైట్‌లో కానీ, జిల్లా యువజన క్రీడల అధికారి కార్యాలయం, జీ-19, ఐడీవోసీ, కలెక్టర్ కార్యాలయం, పాల్వంచలో స్వయంగా వచ్చి నమోదు చేయించుకోగలరని తెలిపారు. పూర్తి వివరాలకు 95054 23226 ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరని ఆయన కోరారు.


వివరాలు వెల్లడిస్తున్న డీవైఎస్‌వో పరంధామరెడ్డి

రౌడీషీటర్ల కదలికలపై పోలీస్ నిఘా

ఖమ్మంక్రైం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై నిత్యం నిఘా పెట్టాలని, గత మూడేళ్లలో తరుచూ భూదందాలు, దౌర్జన్యాలు, సెటిల్‌మెంట్లు, దాడులతో పాటు గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలతో భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజా జీవనానికి విఘాతం కలిగించే వారిపై పీడీయాక్ట్ పెట్టి జైలుకు పంపాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ ఖమ్మం జిల్లాలోని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో నేరప్రవృత్తి కలిగిన 225 మంది రౌడీషీటర్ల కదలికలపై పోలీసు అధికారులు దృష్టిపెట్టారు. వారి ఇళ్లకు వెళ్లి ఆరాతీసి వివరాలు సేకరించారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని నేరస్తులు సత్ప్రవర్తన దిశగా అడుగులు వేయాలని రౌడీషీటర్లకు పోలీసులు సూచించారు. ప్రతీ ఒక్కరిపై సాంకేతిక పరిజ్ఞానంతో నిఘా ఏర్పాటు చేశామని, ఏ చిన్నతప్పు చేసినా పట్టుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా గతంలో నేరాలకు పాల్పడినవారు నేరప్రవృత్తిని వదిలి సమాజంలో ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. నేరస్తులు తొందరపాటుతో చేసిన నేరాలు వారి కుటుంబ సభ్యులను ఇబ్బందుల్లో పడేస్తాయని గుర్తుచేశారు. గతాన్ని మరిచిపోయి, మారిన మనసుతో ముందడుగు వేయాలని కోరారు. సత్ప్రవర్తన కలిగిన నేరస్తులపై రౌడీషీట్ ఎత్తివేసే అవకాశం ఉంటుందని వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

గంజాయి రవాణా కేసులో సారపాక యువకుడిపై పీడీ యాక్ట్

చర్లపల్లి జైలుకు తరలించిన జూలూరుపాడు పోలీసులు
డీఎస్పీ, సీఐలను అభినందించిన ఎస్పీ
వివరాలు వెల్లడించిన భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

జూలూరుపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తూ పలు జిల్లాల్లో నమోదైన కేసుల్లో నిందితుడైన ఓ యువకుడిపై జూలూరుపాడు పోలీసులు పీడీ యాక్ట్‌ను నమోదు చేసినట్లు భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు శనివారం తెలిపారు. బూర్గంపాడు మండలం సారపాక తాళ్లగొమ్మూరుకు చెందిన దుగ్గెంపూడి శివశంకర్‌రెడ్డి అనే యువకుడు అక్రమ సంపాదనకు అలవాటుపడి నిషేధిత గంజాయిని అక్రమ రవాణా చేస్తూ పలు మార్లు పట్టుపడ్డాడు. సదరు యువకుడిపై బూర్గంపాడు, జూలూరుపాడు, హైదారాబాద్ బాలానగర్ పోలీస్‌స్టేషన్లలో పలు కేసులు నమోదు చేయటం జరిగింది. ఆ యువకుడు జైలుకు వెళ్లి తిరిగివచ్చిన తర్వాత కూడా తన తీరు మార్చుకోకుండా గంజాయి రవాణాకు పాల్పడుతుండటంతో అతడిపై పీడీ యాక్ట్ అమలు చేస్తూ పోలీస్ ఉన్నతాధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి పీడీ యాక్ట్ ఉత్తర్వుల కాపీని అందుకున్న జూలూరుపాడు పోలీసులు యువకుడిని చర్లపల్లి జైలుకు తరలించి అధికారుల సమక్షంలో నిందితుడికి కాపీని అందజేశారు. గంజాయి రవాణా చేసి సంపాదించిన నిందితుడు శివశంకర్‌రెడ్డి ఆస్తులను గతంలో కోర్టు ఆదేశాలతో జూలూరుపాడు పోలీసులు జప్తు చేయడం జరిగింది. నిందితుడిపై పీడీ యాక్ట్ నమోదయ్యేలా కృషి చేసిన కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, జూలూరుపాడు సీఐ శ్రీలక్ష్మి, సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.


చర్లపల్లి జైలు వద్ద నిందితుడికి ఉత్తర్వుల కాపీని అందజేస్తున్న జూలూరుపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీలక్ష్మి

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో యువకుడి అరెస్ట్

కల్లూరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండలంలోని పేరువంచ గ్రామంలో ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య ఘటనలో కారకుడైన యువకుడు తురక అనిల్‌ను శనివారం కల్లూరు ఏసీపీ ఏ.రఘు అరెస్ట్ చేశారు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పేరువంచకు చెందిన కోనూరు జశ్వితతో అదే గ్రామానికి చెందిన యువకుడు తురక అనిల్ పరిచయం ఏర్పడి ప్రేమ, పెళ్లి పేరుతో వేధింపులకు పాల్పడటంతో మనోవేదనకు గురియైంది. గురువారం ఉదయం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. సదరు బాలిక కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో నిందితుడైన అనిల్‌పై ఫోక్స్, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై పేరువంచ గ్రామంలో శుక్రవారం ఏసీపీ రఘుతో పాటుగా సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగం, కల్లూరు ఎస్ఐ డి.హరితలు క్షేత్రస్థాయిలో సంఘన స్థలాన్ని సందర్శించి బాలిక మృతి చెందిన ఘటనపై సమగ్ర విచారణ జరిపారు. శనివారం అనిల్‌ను అదుపులోకి తీసుకోని ఏసీపీ రఘు అరెస్ట్ చేసి సతుపల్లి కోర్టుకు హాజరు పరిచారు.

ప్రభుత్వ భూమిని పరిశీలించిన ఎఫ్‌డీవో


జూలూరుపాడులో ప్రభుత్వ భూమిని పరిశీస్తున్న కొత్తగూడెం ఎఫ్‌డీవో కోటేశ్వరరావు

జూలూరుపాడు, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): అటవీశాఖకు కేటాయించనున్న ప్రభుత్వ (సీపీ) భూమిని కొత్తగూడెం ఎఫ్‌డీవె యు.కోటేశ్వర రావు రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులతో కలసి పరిశీలించారు. జూలూరుపాడు అటవీ రేంజ్‌లో శనివారం ఆయన పర్యటించారు. జూలూరుపాడు రెవెన్యూ పరిధిలోని 250 సర్వే నెంబర్‌లో ఉన్న భూమిని పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు మండలంలోని రాజరావుపేట నుంచి ఏన్కూరు మండలం బురదరాఘవపురం వరకు అటవీ ప్రాంతాల్లో నుంచి బీటీ రహదారి నిర్మాణం చేపట్టడంతో అటవీశాఖ భూమిని కోల్పోతుందన్నారు. దానికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సీపీ ల్యాండ్ అప్పగించాల్సి ఉందన్నారు. జూలూరుపాడు రెవెన్యూలోని 250సర్వే నెంబర్‌లో సీతారామ కెనాల్ సమీపంలో ఉన్న 9ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు కేటాయించనున్నది. ఈ భూమి అటవీశాఖ మొక్కల పెంపకానికి అనువుగా ఉంటుందో లేదో పరిశీలించి ప్రభుత్వానికి నివేదికను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్వో ప్రసాదరావు, ఆర్ఐ ఆదినారాయణ, పంచాయతీరాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, అటవీ సిబ్బంది హన్మంత్, నరసింహారావు తదిదరులు పాల్గొన్నారు.

'పేట'లో పోలీసుల కార్డన్ సెర్చ్

సరైన పత్రాలు లేని 86 వాహనాలు, 16 మద్యం సీసాలు స్వాధీనం
డ్రగ్స్‌పై పోలీసుల అవగాహన సదస్సు
నేరాలకు దూరంగా ఉండాలని యువతకు సూచించారు

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని వడ్డెర బజారులో శనివారం తెల్లవారుజాము నుంచి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన చైతన్యం కార్యక్రమంలో భాగంగా పోలీసులు నాకా బందీని నిర్వహించారు. అశ్వారావుపేట సీఐ నాగరాజు ఆధ్వర్యంలో అశ్వారావుపేట, దమ్మపేట పోలీసులు సుమారు మూడు గంటల పాటు ఈ కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ఇంట్లోని వ్యక్తుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతీ నివాసంలోని వాహనాలను పరిశీలించారు. అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, మాదక ద్రవ్యాలు ఏమేనా ఉన్నాయా అనే దానితో పాటు పలు అంశాలపై పరిశీలన చేశారు. కార్డన్ సెర్చ్‌లో సరైన ధ్రువ పత్రాలు లేనటువంటి 70 ద్విచక్ర వాహనాలు, నాలుగు ఆటోలు, నాలుగు కార్లు, ఆరు ట్రాక్టర్లు, రెండు లారీలను సీజ్ చేశారు. ఆయా వాహనాలకు సంబంధించిన పత్రాలు పరిశీలన చేసి వాహనాలు ఇస్తామని లేదంటే చలానాలు విధించి సీజ్ చేస్తామని తెలిపారు. రెండు బెల్ట్ దుకాణాల్లోని 16 మద్యం సీసాలను సీజ్ చేసి ఇరువురిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా కాలనీలో డ్రగ్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో సీఐ నాగరాజు మాట్లాడుతూ యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు. నేరాలకు దూరంగా అందమైన జీవితాన్ని గడపాలని కోరారు. డ్రగ్స్ వినియోగించినా, విక్రయించినా కఠినమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్నా పోలీసులకు తెలపాలని కోరారు. తమ వద్ద ఉన్న వాహనాలకు పూర్తిస్థాయిలో పత్రాలు కలిగి ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ యయాతిరాజు, రామ్మూర్తి, అఖిల, సాయికిషోర్ రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.


పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ట్రాక్టర్లు


దాడుల్లో సీజ్ చేసిన మద్యం సీసాలు

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

కూల్‌డ్రింక్‌లో కలుపుమందు కలిపి కుమారుడికిచ్చి.. తానూ తాగిన సల్మా
విషమంగానే చిన్నారి పరిస్థితి
కుటుంబంలో కలహాలే ఘటనకు కారణం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో కూల్‌డ్రింక్‌లో కలుపునివారణ మందు కలిపి చిన్న కుమారుడికి ఇచ్చి.. తానూ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. ఇక చిన్నారి పరిస్థితి కూడా విషమంగానే ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలివీ.. సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపూరి కాలనీలో నివాసం ఉంటున్న పఠాన్ సల్మా (29), సలీమ్ దంపతులకు తొమ్మిదేళ్ల వయసున్న నసీమ్, ఆరేళ్ల వయసున్న నాయమ్ కుమారులున్నారు. సలీమ్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, సల్మా ప్రైవేట్ జాబ్ చేస్తూ స్థానిక ద్వారకాపూరి కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇటీవల భార్యాభర్తల మధ్య కలహాలు మొదలై తరచూ గొడవలు జరుగుతుండటంతో మనస్తాపం చెందిన సల్మా శుక్రవారం భర్త ఇంట్లో లేని సమయంలో కూల్‌డ్రింక్‌లో కలుపు నివారణ మందును కలిపి తన ఇద్దరు కుమారులకు ఇచ్చింది. అయితే చిన్న కుమారుడి కి తాగించిన సల్మా తాను కూడా పూర్తిగా తాగేసింది. ఈ లోపు పెద్దకుమారుడు నసీమ్ ఆ గ్లాసును విసిరి కొట్టాడు. కొంతసేపటికి విషయాన్ని గమనించిన చుట్టుపక్కలవారు స్థానికంగానే నివాసం ఉండే సల్మా సోదరి సిరాజ్ నాగూర్‌బీకి సమాచారమివ్వగా.. ఆమె స్థానికుల సాయంతో ఇద్దరినీ సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించాలని సూచించారు. ఖమ్మం తరలించగా పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం తెల్లవారు జామున సల్మా మృతిచెందగా చిన్నారి సయాన్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సల్మా మృతికి ఆమె భర్తే కారణమంటూ మృతురాలి సోదరి సిరాజ్ నాగూర్‌బీ ఫిర్యాదు మేరకు సలీమ్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.


పఠాన్ సల్మా (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

జూలూరుపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలోని మాచినేనిపేటతండా గ్రామంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. మండలంలోని పడమట నర్సాపురంకు చెందిన షేక్ హుస్సేన్ ద్విచక్రవాహనంపై కొత్తగూడెం నుంచి పడమట నర్సాపురం వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో మాచినేనిపేట తండాలో రహదారిపై గుంతలు ఉండడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కింద పడిపోయింది. ఈ సంఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతన్ని 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళను వేధిస్తున్న కుటుంబ సభ్యులపై కేసు ..

చింతకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన ఉసికల సునీతను వేధిస్తున్న ఆమె భర్త వెంకటితో పాటు కుటుంబ సభ్యులైన మరో ఇద్దరిపై శనివారం కేసు నమోదైంది. సునీత కొంత కాలంగా ఖమ్మంలో ఉంటుంది. నాగులవంచ కళాశాలలో చదువుతున్న కుమార్తెను చూసేందుకు గత నెల 13న వెళ్లగా భర్తతో పాటు మరిది, మరిది కుమారుడు దాడి చేసి గాయపర్చారని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ వీరేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థుల 'ఎఫ్ఆర్ఎస్'లో రాష్ట్రంలో చింతకాని ప్రథమం



అవార్డు అందుకుంటున్న ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ

చింతకాని, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ముఖ ఆధారిత హాజరు (ఎఫ్ఆర్ఎస్)లో చింతకాని మండలం రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో చింతకాని ఎంఈవో సలాది రామారావుకు ప్రశంసాపత్రం అందుకున్నారు. జిల్లా ఉన్నతాధికారుల సలహాలు, సూచనలతో తాము ఈ ఘనత సాధించినట్లు ఎంఈవో రామారావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ అడిషనల్ డైరక్టర్ రాధారెడ్డి, ఎస్‌సీఆర్టీ డైరక్టర్ రమేష్, రీజనల్ డైరక్టర్ వరంగల్ సత్యనారాయణరెడ్డి, పాఠ్యపుస్తకాల డైరక్టర్ శ్రీనివాసచారి, జిల్లా ఎంఈవోలు పాల్గొన్నారు.

గణేశ్వరం పాఠశాలకూ అవార్డు

రఘునాథపాలెం: రఘునాథపాలెం మండలంలోని మారుమూల ప్రభుత్వ పాఠశాల కాని ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో హాజరులో ఉత్తమ పాఠశాలగా ఆదర్శంగా నిలిచింది. విద్యార్థుల ముఖ ఆధారిత హాజరులో రాష్ట్రంలోనే బెస్ట్ పర్సంటేజ్ ఆఫ్ అటెండెన్స్ అవార్డుకు ఎంపి కైంది. శనివారం హైదరాబాద్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవవనరుల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యూకేషన్ నవీన్‌నికోలస్ చేతుల మీదుగా గణేశ్వరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయశ్రీ అవార్డును అందుకున్నారు.

ఇసుక లారీల మార్గంపై చెలరేగిన వివాదం

కమలాపురం, చిన్నరావిగూడెం గ్రామస్థుల మధ్య ఘర్షణ
కాంట్రాక్టర్ వాహనం అద్దం ధ్వంసం : స్టేషన్‌లో ఫిర్యాదు


ఘర్షణలు పడుతున్న గిరిజన సొసైటీ సభ్యులు

మణుగూరు, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : మణుగూరు మునిసిపాలిటీ పరిధిలోని కోడిముత్తయ్య గుంపు 2 ర్యాంపుకు ఇసుక లారీల రాకపోకలకు సంబంధించి మార్గం ఏర్పాటుపై శనివారం కమలాపురం, చిన్నరావిగూడెం గ్రామస్థుల మధ్య వివాదం చోటు చేసుకుంది. కోడిముత్తయ్య గుంపుకు చెందిన ర్యాంపు వద్ద ఇసుక లోడ్ చేసుకున్న లారీలు గతంలో కమలాపురం గ్రామం మీదుగా రాకపోకలు జరిగేవి, అయితే ఇటీవల కాలంలో కమలాపురంగ్రామస్థులు లారీలను అడ్డుకుని ఆందోళన చేశారు. దీంతో సదరు ర్యాంపు నిర్వాహకులు అనంతారం మీదుగా లారీలను రాకపోకలు సాగించేందుకు ప్రయత్నించగా దానిని అనంతారం ర్యాంపు వాళ్లు అడ్డుకున్నారు. ఈ రెండు ఇసుక ర్యాంపులు చిన్నరావిగూడెం, కమలాపురం గ్రామాలకు చెందిన గిరిజన సొసైటీలతో నడుస్తుండగా సొసైటీ సభ్యులు గ్రామస్థుల మధ్య వివాదం మొదలైంది. దాదాపు రెండు గంటల పాటు జరిగి పరిస్థితులు ఉద్రిక్తకు దారి తీశాయి. అనంతారం ర్యాంపు సమీపంలో కోడిముత్తయ్య గుంపు 2 ఇసుక నిర్వాహకుడు పీవీ చారి కుమారుడు వాహనాన్ని కమలాపురం గ్రామస్థులు ధ్వంసం చేశారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అయితే ఈ విషయంలో ర్యాంపు నిర్వాహకుడు పీవీ చారి కుమారుడు శ్యాం వేగంగా తమవైపుకు వాహనాన్ని నడిపించిన క్రమంలో వాహనం అద్దం పగిలిందని తెలిపారు, వివాదం పెద్దదిగా మారడంతో మణుగూరు సీఐ నాగబాబు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను శాంతింప జేశారు. కాగా జరిగిన సంఘటనపై కమలాపురం గ్రామానికి చెందిన అనంతారం సొసైటీ సభ్యులు స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మందుబాబులకు రెండు రోజుల పాటు ట్రాఫిక్ విధులు

పోలీసులకు సహాయంగా ఉండాలని తీర్పు చెప్పిన న్యాయమూర్తి
రూ.2వేలు జరిమానా విధింపు

ఖమ్మం లీగల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలను నడిపి పోలీసులకు పట్టుబడిన ఏడుగురికి రెండురోజుల పాటు ట్రాఫిక్ విధులు నిర్వహించాలంటూ ఖమ్మం సంచార ప్రత్యేక న్యాయస్థాన న్యాయాధికారి బక్కెర నాగలక్ష్మి శనివారం తీర్పుచెప్పారు. వారికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించడంతో పాటు రెండు రోజుల పాటు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వదరకు ట్రాఫిక్ పోలీసులకు సహాయంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడితే కఠిన చర్యలు : ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ

ఖమ్మంక్రైం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ సీఐ బెల్లం సత్యనారాయణ శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇటీవల పోలీసులు జరిపిన తనిఖీల్లో మద్యంతాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఏడుగురికి కౌన్సెలింగ్ నిర్వహించి ఖమ్మం స్పెషల్‌మొబైల్ కోర్టులో హాజరుపరిచామని, న్యాయమూర్తి బక్కెర నాగలక్ష్మి వారికి రూ.2వేల చొప్పున జరిమానాతో పాటు రెండురోజులు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని తీర్పుచెప్పారన్నారు.

గోవులను తరలిస్తున్న వాహనం పట్టివేత

భద్రాచలం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : భద్రాచలంలోని చెక్‌పోస్టు వద్ద 12 ఆవులతో వెళ్తున్న రెండు వాహనాలను పట్టణ పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఆవులను అక్రమంగా రెండు వాహనాల్లో తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద ఆగకుండా పోవడంతో విశ్వహిందూ పరిషత్ వారు వెంటపడి పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఆర్డీవో అనుమతి లేకుండా కేవలం పంచాయతీ కార్యదర్శి అనుమతితో వాహనాల్లో అక్రమంగా గోవులను తరలిస్తుండటంపై వారు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. పట్టుబడిన ఆవులకు కాళ్లు విరిగి, రక్తంకారినా కనీసం కనికరం లేకుండా తరలిస్తుండటం హేయమైన చర్యని విశ్వహిందూపరిషత్ నాయకులు ఏకే నాయుడు పేర్కొన్నారు.



నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ఖమ్మంరూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాయీబ్రాహ్మణ ఐక్యవేదిక జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులను రాష్ట్ర కమిటీ శనివారం ఎన్నుకుంది. జిల్లాఅధ్యక్షుడిగా ఖమ్మం పట్టణానికి చెందిన నంద్యాల నరసింహారావును, కార్యదర్శిగా రావులపాటి శ్రీనివాస్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నరసింహారావు తెలిపారు. ఇతర కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామని, త్వరలోనే జిల్లాలో జిల్లా మహాసభ ఏర్పాటు చేస్తామన్నారు.



నరసింహారావు, శ్రీనివాస్‌రావు

లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రారంభం

ఖమ్మంకలెక్టరేట్/లీగల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): న్యాయం అందరికీ సమానమే అని దానిని పొందే హక్కు అందరికీ ఉంటుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కెవీ చంద్రశేఖర్‌రావు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ప్రతీ శనివారం, సోమవారం పారా లీగల్ వలంటీర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. సీనియర్ సిటిజన్లు వారి సమస్యలు చెబితే రెవెన్యూ డివిజన్ అధికారికి అందిస్తారన్నారు. ఆర్డీవో గరిడే నర్సింహరావు మాట్లాడుతూ వయోజన వృద్ధులకు మెయింటెనెన్స్ మాత్రమే వారి పరిధిలో ఉంటుందని భూ తగాదాలు, గిఫ్ట్ డీడ్స్ మార్పి వచ్చే దరఖాస్తులు కలెక్టర్ ఆధ్వర్యంలో పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పారా లీగల్ వలంటీర్ నాగమణి తదితరులు పాల్గొన్నారు.



లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను ప్రారంభిస్తున్న కార్యదర్శి చంద్రశేఖర్‌రావు

గ్రంథాలయ ఉద్యోగుల ఇష్టారాజ్యం

- సమయం పాటించని వైనం
- నాలుగు నెలలుగా పుస్తకాల కొరత, తాగునీరులేని దుస్థితి
- ఫోన్ చేసినా సమాధానం చెప్పని కార్యదర్శి
- జిల్లా గ్రంథాలయంలో నిరుద్యోగుల ఇబ్బందులు





జిల్లా గ్రంథాలయం, ఖాళీగా ఉన్న ఉద్యోగి కుర్చీ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రధాన గ్రంథాలయంలో ఉద్యోగులు సమయపాలన పాటించకుండా.. ఇష్టం వచ్చిన సమయానికి రావటం, పోవటం చేస్తుండంతో నిరుద్యోగులు తీవ్రఇబ్బంది పడుతున్నారు. పుస్తకాలు, సౌకర్యాలు కల్పించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు నిరుద్యోగులు చెబుతున్నారు. గతంలో ఉద్యోగులు కార్యాలయం, లైబ్రరీ రెండూ ఒకే ప్రాంతంలో ఉండటంతో నిరుద్యోగులకు కావాలల్సిన సౌకర్యాలు కల్పించే వారని, ప్రస్తుతం ఉద్యోగుల కార్యాలయం పాతమునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేయటంతో అసలు ఉద్యోగులు కార్యాలయానికి వస్తున్నారా, లేదా అనే విషయం ఎవరికి తెలియని పరిస్థితి నెలకొంది. గ్రంథాలయానికి పూర్తిస్థాయి చైర్మన్ డైరక్టర్లు, కార్యదర్శి లేకపోవటం ఉద్యోగులకు వరంగా మారిందనే వాదనలు వినపడుతున్నాయి. వారానికి ఓసారిశుక్రవారం సెలవు రోజు కార్యదర్శి ఖమ్మం రావటంతో, సంతకాలు చేసి వెళ్లిపోతారని పలువురు నిరుద్యోగులు చెబుతున్నారు.

అందుబాటులో ఉండని ఉద్యోగులు

గ్రంథాలయాలల్లో ఎందరో యువత ఉదయం9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.వారికి ఏమైనా సమస్యలు వస్తే వినేందుకు గ్రంథాలయ ఉద్యోగులు అందుబాటులో ఉండరని, కార్యదర్శి ఎప్పుడు వస్తుందో, తెలియదని పలువురు నిరుద్యోగులు చెబుతున్నారు. ఎవరైన సమస్య చెప్పేందుకు ఫోన్ చేసినా నేను పని మీద బైటకు వెళ్లాను రేపేచేద్దాంలే అనే సమాధానం చెబుతున్నారని నిరుద్యోగులు చెబుతున్నారు.

మూడు జిల్లాల ఇన్‌చార్జ్‌కి.. ఇక్కడి బాధ్యతలు

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలంటే లైబ్రరీలోనే ఉద్యోగులు, కార్యదర్శి ఉండే విధంగా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి. మూడు జిల్లాలకు ఇన్‌చార్జిగా ఉన్న కార్యదర్శికి బాధ్యతలు అప్పగించటంతో ఆమె నెలలో రెండు మూడుసార్లు మాత్రమే గ్రంథాలయ ఉద్యోగుల కార్యాలయానికి వస్తున్నారు. ఫలితంగా నిరుద్యోగుల సమస్యలు వినటం, పరిష్కరించే సమయం లేదని తెలుస్తుంది. ఏదైన సమస్యలు చెప్పాలని గ్రంథాలయ కార్యదర్శికి ఫోన్ చేసినా ఎత్తే పరిస్థితి లేదని, నాలుగు నెలలుగా పోటీ పరీక్షల పుస్తకాల కొరత ఉందని, మూత్రశాలలు, మంచినీరు, తదితర సమస్యలు పట్టించుకునే వారే లేరు.

గాలికుంటు వ్యాధికి టీకాలు వేయించాలి

- పశువైద్యశాఖ ఏడీ శ్రీరమణి

ఖమ్మంరూరల్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని పశువైద్యశాఖ ఏడీ కె.శ్రీరమణి రైతులకు తెలిపారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె రైతులకు పలు సలహాలు అందించారు. గ్రామంలోని 193 పశువులకు టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అనంత హరీష్, సిబ్బంది రవికుమార్, పాషా, రామారావు, గోపాల మిత్రులు వెంకటేశ్వర్లు, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



సత్యనారాయణపురంలో టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న శ్రీరమణి

పారిశుధ్య పనులు తనిఖీ చేసిన మేయర్

ఖమ్మంఅర్బన్ అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మేయర్ పునుకొల్లునీరజ నగరంలో పారిశుధ్య పనుల తీరును శనివారం తనిఖీ చేశారు. 32,36 డివిజన్ల పరిధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, విమెన్స్ కాలేజీ ఏరియా, రజక వీధి, తదితర ప్రాంతాల్లో పర్యటించారు. గ్యాంగ్ వర్క్, తదితర పారిశుధ్య చర్యలను పరిశీలించారు. నగర పరిశుభ్రత కోసం కార్మికులు పాటు పడాలన్నారు. మురుగు కాల్వలు శుభ్రం చేయటంతోపాటు చెత్తదిబ్బలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. మేయర్‌తోపాటుమాజీ కార్పొరేటర్ బాలగంగాధర్ తిలక్, సహాయ కమిషనర్ అనిల్ కుమార్, శానిటేషన్ సూపర్ వైజర్ సాంబయ్య, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు వెంకటేశ్వర్లు,శంకర్ పాల్గొన్నారు.



పనులు తనిఖీ చేస్తున్న మేయర్

'ఓ ప్రియ' జ్యూయలరీ ఎగ్జిబిషన్ ప్రారంభం

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని గ్రాండ్‌గాయత్రి హోటల్‌లో మూడురోజులపాటు ఓ ప్రియ జ్యూయలరీ ఎగ్జిబిషన్ కం సేల్‌ను మేనేజింగ్ డైరెక్టర్ మందాటి క్రాంతి శనివారం ప్రారంభించారు. తెలుగువారి అలంకరణకు ప్రాధాన్యం ఇస్తూ ఈ ఎక్స్‌పోలో గోల్డ్, డైమండ్, పోల్కి వాటిపై స్పెషల్ డిస్కౌంట్ అందిస్తున్నట్లు చెప్పారు. చాలా వెరైటీలు ఉన్నాయని తెలిపారు. మా కంపెనీకి అమెరికాలో 9 స్టోర్స్, హైదరాబాదులో ఒక స్టోర్స్ ఉన్నాయని తెలిపారు. ఈఎక్స్‌పో ఈనెల 26,27 తేదీ వరకు కొనసాగుతుందని తెలిపారు.



ఆభరణాలు అందజేస్తున్న క్రాంతి

నేడు నేలకొండపల్లిలో క్యాన్సర్ వైద్యశిబిరం

నేలకొండపల్లి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ఆదివారం నేలకొండపల్లి రావెళ్ళభవన్‌లో నిర్వహించనున్న ఉచిత కాన్సర్ వైద్యశిబిరాన్ని విజయవంతం చేయాలని భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, ఎన్జీఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో కోరాయి. ఖరీదైన వైద్యం గ్రామీణ పేదలకు అందుబాటులో లేని ప్రస్తు పరిస్థితుల్లో ఈ ఉచిత కాన్సర్ వైద్య శిబిరాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరాయి. నేలకొండపల్లి భక్తరామదాసు సర్వీస్ సొసైటీ, నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ప్రముఖ వైద్యులు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా అధ్యక్షుడు వెంకన్న

ఖమ్మంఅర్బన్‌అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం(టీయూసీఐ) జిల్లా అధ్యక్షుడు పేరబోయిన వెంకన్న డిమాండ్ చేశారు. శనివారం బల్లేపల్లిలోని మూడోడివిజన్ అడ్డా దగ్గర నిర్వహించిన సుతారి మేస్త్రులు సమావేశంలో మాట్లాడారు. లేబర్ ఆఫీసులో పెండింగ్‌లో ఉన్న వేలాది క్లెయిమ్స్‌ను పరిష్కరించాలన్నారు. ఖమ్మంలో ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, లేబర్ కార్డు ఉన్న ప్రతీ కార్మికుడికి ప్లాట్ ఇచ్చి ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ఉపేందర్, రాజు, నగేష్,వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో 'హార్వెస్ట్' విద్యార్థుల ప్రతిభ

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి 23 వరకు హైదరాబాద్‌లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) అండర్-19 రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి పతకాలు సాధించారని కళాశాల యజమాన్యం తెలిపింది. 97 కేజీల విభాగంలో హర్షమణి రజత పతకం సాధించగా, 79 కేజీల విభాగంలో అమేష్ బహదుర్ రజత, 74 కేజీల విభాగంలో జయదేవ్ కాంస్యం, 70 కేజీల విభాగంలో శివతేజనందన్ కాంస్యం, 65 కేజీల విభాగంలో విష్ణువర్ధన్ కాంస్యం, 61 కేజీల విభాగంలో యువరాజ్ కాంస్య పతకం సాధించారని వారు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతిరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి

పేదల సొంతింటి కల నెరవేరుస్తున్న కాంగ్రెస్

- నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల, కార్పొరేటర్లు

ఖమ్మంకార్పొరేషన్,అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇంటిస్థలాల సమస్యను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్‌కు వివరించటంతో సమస్య పరిష్కారమైందని నగర కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి హర్షం వ్యక్తం చేశారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్పొరేటర్లుతో కలిసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఇంటిస్థలం సమస్య ఉన్నవారు తక్కువ స్థలంలోను ఇళ్లుకట్టుకునేందుకు జీవో నెంబర్ 69ను విడుదల చేసిందని జీవో విడుదల వెనుక యుగంధర్ కృషి ఉందన్నారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి సహకారం ఉందన్నారు. కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, మాజీ కార్పొరేటర్ వడ్డేబోయిన నర్సింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల

మంత్రి తుమ్మలకు కృతజ్ఞతలు: మేయర్

ఇందిరమ్మ ఇళ్లనిర్మాణంలో ఇంటి స్థలం తక్కువగా ఉన్న లబ్ధిదారులకు 30 గజాలు కుదింపు నిర్ణయం తీసుకోవటం మంచి పరిణామమని,ఇటువంటి నిర్ణయంతో పట్టణ ప్రాంతాల్లోని నిరుపేదలకు ఎక్కువగా లబ్ధి చేకూరుతుందని మేయర్ పునుకొల్లు నీరజ హర్షం వ్యక్తం చేశారు. ఇంటి స్థలాల సడలింపుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేషంగా కృషి చేశారన్నారు. ఈ మేరకు ఖమ్మంలో మేయర్ విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మేయర్ నీరజ కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న బ్యాగ్‌ను అందించిన సీఐ

ఖమ్మంక్రైం, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రియాంక అనే యువతి తన బ్యాగును కుర్చీవద్ద పెట్టి మంచినీరు తాగేందుకు వెళ్లింది. కొద్దిసేపటి తర్వాత వచ్చి చూడగా ఆ బ్యాగు కనిపించలేదు. దీంతో ఆమె డయల్ 100కు ఫోన్ చేసి ఫిర్యాదు చేసింది. వన్‌టౌన్ పోలీసులు బ్యాగ్‌ను వెతికి స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ యువతికి బ్యాగ్ అందించారు.

ట్రాఫిక్ చలాన్లు రద్దు చేయాలని విజ్ఞప్తి

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇబ్బందికరంగా మారిన ట్రాఫిక్‌చలాన్లు రద్దు చేయాలని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చలానా రూపంలో వాహనదారులను ఇబ్బందులకు గురిచేశారన్నారు. అదేవిధంగా ఇప్పుడు కాంగ్రెస్‌ప్రభుత్వంలో కూడా ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా వాహనాల చలాన్లను వెంటనే రద్దు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో నాగుల చవితి

నేలకొండపల్లి,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి):నాగులచవితి పర్వదినాన్ని శనివారం మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. తెల్లవారుఝాము నుంచే మహిళలు దేవాలయాలకు బారులు తీరారు. దేవాలయాల్లో ప్రత్యేక పూజల అనంతరం పుట్టలో పాలను పోసి, సంప్రదాయ సిద్ధంగా, భక్తి ప్రపత్తులతో నాగమ్మకు పూజలు చేశారు.

కూసుమంచి: మండలంలో నాగుల చవితి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కూసుమంచిలోని శివాలయంలోనూ, జీళ్లచెరువులోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలోనూ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునుంచే ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. మహిళలు పాముల పుట్టల్లో పాలు పోశారు. పసుపు, కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కూసుమంచి శివాలయంలో భక్తుల పూజలు



జీళ్లచెరువులో..



నేలకొండపల్లిలో పాలు పోస్తున్న మహిళలు

'సర్వజ్ఞ'లో పోషకాహార దినోత్సవం

ఖమ్మంఖానాపురం హవేలి, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని సర్వజ్ఞ పాఠశాలలో శనివారం పోషకాహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. ఈ వేడుకల్లో ప్రీ-ప్రైమరీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు వివిధ రకాల పోషక విలువలున్న ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలను ప్రదర్శిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఉపాధ్యాయులు సైతం విద్యార్థులను అభినందించారు. పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ విద్యార్థులు పోషకాహారాల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ముఖ్యంగా, చిన్నారులు ఎలాంటి ఆహారం తీసుకోవాలో తెలిపారు. మంచి పోషకాహారం అనేది శరీరానికి ఇంధనం లాంటిదని, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటేనే మన ఆరోగ్యం, తెలివితేటలు వృద్ధి చెందుతాయని అన్నారు.



ఉపకార వేతనాలు విడుదల చేయాలి

ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు

ఖమ్మంఅర్బన్, అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల బోధనా రుసుము, ఉపకార వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటుకల రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ జిల్లా కార్యాలయం గిరిప్రసాద్ భవనంలో జరిగిన ఎఐఎస్ఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు.నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను, స్కాలర్ షిప్స్‌ను ఇవ్వకపోవటంతో విద్యార్థుల తల్లి దండ్రులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం మారినా పాలన అదేవిధంగా ఉందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అధిక శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆధారపడ్డారనా చెప్పారు. సమస్య పట్ల ప్రభుత్వం ఇకనైనా స్పందిచక పోతే ఉద్యమాన్ని ఉధృతం చేసి మంత్రులు, ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మడుపల్లి లక్ష్మణ్, సహాయ కార్యదర్శులు షేక్ నాగుల మీరా, శివ, వంశీ, గోపీ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామకృష్ణ

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

బీజేపీ జిల్లా నాయకుడు ఉపేందర్‌రెడ్డి

కూసుమంచి,అక్టోబరు25(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా మండలంలో పత్తి, వరి పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా నాయకుడు గుండా ఉపేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను ఏవో వాణితో కలిసి పరిశీలించారు. ఈ ఏడాది పొడవునా వర్షాలు నిరంతరంగా రావడం మూలంగా పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. చేతికొచ్చిన పత్తి ఎర్రబారిపోయిందని, కాసిన పత్తి తీసేందుకు వీలుకాక నేలరాలుతుందని తెలిపారు. కోతకొచ్చిన వరిపంట నేలవాలిందని, పంట రాలిపోతుందని తెలిపారు. వేలాది రూపాయలు పెట్టుబడులు కోల్పోతున్నారని తెలిపారు. వ్యవసాయశాఖ అధికారులతో సర్వేచేసి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా అధ్యక్షులు బద్దం వెంకటరెడ్డి, అజ్మీరా మల్సూరు, శ్రీనివాసరెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, బాణోతు నాగేశ్వరరావు , తదితరులు పాల్గొన్నారు.



కూసుమంచి మండలం పెరికశింగారంలో వరిని పరిశీలిస్తున్న నాయకులు



ఆంధ్రజ్యోతి

● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

ZONE

ఆదివారం 26 అక్టోబరు 2025

వైరా-మధిర

సత్తుపల్లి

WYRA, MADHIRA, SATHUPALLY

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి: శ్రవంతి

బోనకల్, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మాదక ద్రవ్యాల బారీన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి వేముల స్రవంతి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల సేవనం-దుష్పరిణామాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వాడకం ద్వార ఆరోగ్యం పాడవుతుందని, జీవితాలు ఛిద్రమవుతాయని తెలిపారు. మంచి అలవాట్లు, నడవడికతో అత్యున్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళినిశ్రీ, అధ్యాపకులు అంతోటి తిరుపతిరావు, లక్ష్మీకాంతం, రామకృష్ణ, ప్రేమ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మధిర కళాశాలలో ఎన్ఎస్ఎస్ శిబిరం



క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

మధిర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిర ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు శనివారం వారి కళాశాలలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలో పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డి, కంపచెట్లను తొలగించారు, ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి ఉండాలని తాము చదువుకునే కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. గ్రామాలలో ఎన్ఎస్ఎస్ శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో పరిసరాల పరిశుభ్రత, సామాజిక రుగ్మతలపై చైతన్య పరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ తౌరియ, లత వలంటీర్లు కమల, శోభారాణి, జరీనా బేగం, సాంబయ్య, నాగరాజు, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

రాఘవాపురంలో

చింతకాని: మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో గాయత్రి డిగ్రీ కళాశాల ఖమ్మం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలన్నారు. గ్రామ ప్రజల సహకారంతో గ్రామంలో సేవా కార్యక్రమంలో పాల్గొంటూ విద్యా, వైద్యం, చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్ఐ వీరేందర్, కళాశాల డైరక్టర్ కే కుటుంబరావు, పీవో ఎస్ జయప్రద, మాజీ ఉపసర్పంచ్ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శి సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తలసీమియా బాధితులకు రక్తదానం



రక్తదాతలకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

చింతకాని, అక్టోబరు 25(ఆంధ్రజ్యోతి): మధిర నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు పుట్టినరోజు సందర్భంగా చింతకాని బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని నాగులవంచ గ్రామంలో నిర్వహించిన కార్యక్రమాన్ని మండల నాయకులు ప్రారంభించారు. రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు అందజేశారు. అనంతరం కమల్‌రాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ కేక్‌కట్ చేశారు. మండల కార్యదర్శి బొడ్డు వెంకటరామారావు, మాజీ వైస్ ఎంపీపీ గురిజాల హనుమంతరావు, జిల్లా నాయకులు మంకెన రమేష్, గడ్డం శ్రీను, పర్వగాని ఏడుకొండలు, కోపూరి నవీన్, అయ్యోరి సాయి, మీరా సాహేబ్, నాదెండ్ల వెంకటేష్, చాట్ల సురేష్, భగవాన్, శీలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రగ్స్‌పై కళారూపాలు



డ్రగ్స్ నిరోధంపై కళారూపాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

వైరా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో చెడు వ్యసనాలకు దారితీస్తున్న మాదక ద్రవ్యాల వాడకానికి విద్యార్థులు దూరంగా ఉండాలని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి సూచించారు. వీటి నిరోధంపై ఆ కళాశాల విద్యార్థులు శనివారం క్లాస్‌రూంలో వినూత్న కళారూపాలు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు ప్రసాదబాబు, స్వప్న, మేదర వెంకటముత్యం పాల్గొన్నారు.

అర్హతను బట్టి కొలువు

» నేడు సత్తుపల్లిలో మెగా జాబ్‌మేళా

» సింగరేణి డైరెక్టర్ (పా)వెంకటేశ్వరరావు

సత్తుపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాబ్‌మేళాలో పాల్గొని అభ్యర్థులు తమ అర్హతను బట్టి ఉపాధి అవకాశాలని సంపాదించాలని సింగరేణి డైరెక్టర్ (పా) కొప్పుల వెంకటేశ్వరరావు అన్నారు. సింగరేణి సంస్థ, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో నేడు స్థానిక వేంసూర్ రోడ్‌లోని రాణీ సెలబ్రేషన్స్‌లో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో మెగా జాబ్ మేళా నిర్వహించడం ద్వారా కొన్ని వేలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని, తద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా ఎదగడంతోపాటు సమాజాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జాబ్‌మేళాలో పాల్గొనే యువతీ, యువకులకు స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మూడు రోజుల నుంచి నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆషా స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మట్టా దయానంద్, కొత్తగూడెం ఏరియా జీఎం షాలెంరాజు, జేవీఆర్, కిష్టారం ఓసీ పీఓలు ఎన్‌వీఎస్.ప్రహ్లాద్, ఎంవీ.నరసింహారావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సింగరేణి డైరెక్టర్ (పా)

జాబ్‌మేళాను వినియోగించుకోవాలి

ఏఎంసీ వైస్‌చైర్మన్ వెంకటప్పారెడ్డి

వేంసూరు: సత్తుపల్లిలో ఆదివారం జరుగనున్న మెగా జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ వైస్‌చైర్మన్ గొర్ల వెంకటప్పారెడ్డి సూచించారు. సింగరేణి సంస్థ, టాస్క్ ఆధ్వర్యంలో సుమారు 80కిపైగా కంపెనీల్లో ఐదువేల ఉద్యోగాల భర్తీ కోసం ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆధ్వర్యంలో ఈ మెగా జాబ్ మేళా జరుగుతుందని దీన్ని యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి 33/11కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని సత్తుపల్లి టౌన్-1 ఫీడర్‌లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు టౌన్ ఏఈ శరత్‌బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో జలగం నగర్, వెంగళరావు నగర్, వేంసూర్ రోడ్, ఆర్టీసీ బస్టాండ్ కాంప్లెక్స్‌లలో ట్రీ కటింగ్ నిమిత్తం సప్లయ్‌కు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మృతుడి కుటుంబానికి చేయూత

కొణిజర్ల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వైరా మునిసిపాలిటీ లాలాపురం గ్రామానికి చెందిన కొంపల్లి వినయ్ ఇటీవలే మరణించిగా ఆయన కుటుంబానికి గ్రామ కాంగ్రెస్ నాయకుడు రెండున్నర క్వింటాళ్ల బియ్యాన్ని శనివారం అందించారు. మృతుడి కుటుంబ పరిస్థితి తెలుసుకున్న గ్రామ నాయకులు వెంటనే స్పందించారు. నాయకులు రవి, చింతనిప్పుప్రసాద్, అప్పారావు, మోదుగు వెంకట్, ఖాసీం, రామారావు, శ్రీహరి, పాల్గొన్నారు.

శాంతి భద్రతలే లక్ష్యంగా పోలీస్ విధులు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిభద్రతలను కాపాడడమే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తారని 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ ఎన్.పెదబాబు అన్నారు. పోలీస్ ఫ్లాగ్ డే-2025దినోత్సవాలలో భాగంగా మండలంలోని గంగారంలో బెటాలియన్ ఉద్యోగులు, సిబ్బంది ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. దేశ రక్షణలో అసువులు బాసిన పోలీసుల సేవలు మరువలేనివని, విధి నిర్వహణలో ప్రజలను రక్షించేందుకు తమ ప్రాణాలను పణంగా పెట్టిన అమరుల త్యాగాలను నేటి పోలీసులు స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్.శ్రీధర్, ఎస్వీ.రంగారెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా సీఐగా వెంకటప్రసాద్

వైరా , అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వైరా సీఐగా వై వెంకటప్రసాద్ నియమితులయ్యారు. ఇంటిలిజెన్సీలో సిఐగా పని చేస్తున్న వెంకటప్రసాదను వైరా సీఐగా నియమించారు. ప్రస్తుతం వైరాలో సిఐగా పనిచేస్తున్న నునావత్ సాగర్ ను కారేపల్లి సిఐగా బదిలీ అయ్యారు.

అగ్రిమెంట్ లేకుండా విత్తన మొక్కజొన్న సాగు చేయెద్దు

» తల్లాడ ఏవో తాజుద్దీన్

తల్లాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కంపెనీలో అగ్రిమెంట్ చేసుకోకుండా రైతులు విత్తన మొక్కజొన్న సాగు చేయొద్దని వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం తల్లాడ మండలంలోని వివిధ గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తల్లాడ మండల ఏవో ఎండీ తాజుద్దీన్ మాట్లాడుతూ.. విత్తన మొక్కజొన్న సాగుచేసే రైతులు కంపెనీ ఏజెంట్ల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్రిమెంట్ చేసుకునేందుకు ముందకు వచ్చే స్థానిక ఏజంట్‌ను మాత్రమే రైతులు ఎంపిక చేసుకోవాలన్నారు. ఏపీ రాష్ట్రానికి చెందిన కొందరు ఏజంట్లు వచ్చి ముందుగా పెట్టుబడులకు డబ్బులు ఇస్తామని ఆశచూపి తక్కువ దిగుబడి వచ్చే విత్తనాలు ఇచ్చే అవకాశం ఉందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి వసతి ఉన్న మేరకు భూములు విత్తన మొక్కజొన్న సాగుకు అనుకూలంగా ఉంటాయని, ఎర్ర ఇసుక భూముల్లో విత్తన మొక్కజొన్న సాగు చేయొద్దని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు జి.శివకుమార్, నవ్య, రైతులు పోలేపల్లి కోటేశ్వరరావు, ఏరువ గోపాలరావు, భద్రయ్య, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగుల చవితి

నాగుల చవితి పండగ సందర్భంగా శనివారం పలు శివాలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో శివుడికి నాగదేవత పూజలు చేసి మోక్షం పొందినదని భక్తుల విశ్వాసం. ఈ క్రమంలోనే పలువురు భక్తులు పుట్టలో పాలు, పిండి పదార్థాలు పోసి మొక్కుకున్నారు. ఇలా సంతానంలేని వారు, వివాహం కాని వారు, దంపతులు మధ్య బేదాభిప్రాయాలు లేకుండా సుఖ సంతోషాలతో సాఫీగా జీవనం గడపాలని కోరుకొంటూ నాగేదేవతకు మహిళ భక్తులు పూజలు చేసి వేడుకున్నారు.



సత్తుపల్లిలో పుట్టలో పాలుపోస్తు పూజలు చేస్తున్న మహిళలు



వైరాలో..



మధిరలో..



ఏన్కూరులో..



కల్లూరులో..

పత్తి రైతులను ఆదుకోవాలి

వైరా, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలరోజుల నుంచి ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో పత్తి పంట పూర్తిగా దెబ్బతిన్నదని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వైరాలో శనివారం యలదండి బాబు అధ్యక్షతన జరిగిన మాస్‌లైన్ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే మిర్చి, వరికి గిట్టుబాటు ధరలు లేక రైతాంగం కుదేలైనా కానీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఆదుకోవడం లేదని విమర్శించారు. ఈ సమయంలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పత్తి రైతులను వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు సీవై.పుల్లయ్య, ఆవుల అశోక్, కంకణాల అర్జున్‌రావు, తడికమళ్ల సీతారాములు, పాశం అప్పారావు, కె.దర్గయ్య, మోదుగు లాలమ్మ, మేడి కొండల్‌రావు, షేక్.జానీ, బండారి భద్రయ్య, నున్నావత్ శ్రీను పాల్గొన్నారు.

పరివర్తన కలిగి ఉండాలి

» జిల్లా న్యాయాదికారి శ్రీనివాసరావు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): శిక్ష అనుభవించిన ఖైదీలంతా నేరాలు చేయకుండా పరివర్తన కలిగి ఉండాలని 6వ అదనపు జిల్లా న్యాయధికారి మారగాని శ్రీనివాసరావు అన్నారు. సత్తుపల్లి మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో సబ్‌జైల్‌తో పాటు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోక్సో యాక్ట్, ఎన్‌డీపీఎస్ యాక్ట్, ఎంఎల్ఎస్‌సీ విధుల గురించి వివరిస్తూ చట్టాలపై అవగాహన కల్పించారు. జైల్ సూపరింటెండెంట్ ఉబ్బల కుటుంబరాజు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ వీ.శ్రీనివాస్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జీ బీఎస్ఎన్.సుమబాల, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జీ వడ్డె లావణ్య, న్యాయవాదులు బొర్రా వెంకట్రావ్, నల్లగట్ల విజయకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.



సబ్‌జైల్‌లో మాట్లాడుతున్న న్యాయాధికారి

నష్టపోయిన పంటలకు పరిహారం చెల్లించాలి

తల్లాడ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం తల్లాడలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లనాయకుడు మాదినేని రమేష్, బొంతు రాంబాబు మాట్లాడుతూ.. అకాలవర్షాలతో పత్తి, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, రైతులు ఆరుగాలం శ్రమించి పంట చేతికి వచ్చేసమాయానికి అకాలవర్షాలతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ముందుగా స్థానిక దొడ్డా కృష్ణయ్యభవనం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందించారు. సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు, మండల నాయకులు నల్లమోతు మోహనరావు, పులి కృష్ణయ్య, చల్లా నాగేశ్వరరావు, కళ్యాణం కృష్ణయ్య, షేక్ మస్తాన్, సత్తెనపల్లి నరేష్, పులి వెంకటనరసయ్య, మన్నేపల్లి రామారావు, అర్జునరావు, కర్లకంత శ్రీను, రవి పాల్గొన్నారు.



తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

ముదిగొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కృష్ణప్రసాద్ హెచ్చరించారు. శనివారం సీఐ మురళీ ఆదేశాల మేరకు గంధసిరి, పెద్దమండవ మున్నేరు పరివాహక ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఇసుక రవాణాకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు

కల్లూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరులోని శ్రీ కాశ్మీర మహాదేవర క్షేత్రం (శివాలయం) ప్రాంగణంలో ప్రభుత్వ పరంగా రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా మెప్మా మిషన్ కోఆర్డినేటర్ సుజాత శనివారం క్షేత్ర స్థాయిలో శివాలయం ప్రాంగణ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కల్లూరు, పుల్లయ్యబంజర గ్రామాలకు కలిపి వేర్వేరుగా సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవతో ఆయా కేంద్రాలను మంజూరు చేశారు. ఇక్కడ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వేర్వేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కల్లూరు మండల కాంగ్రెస్ నాయకుడు పసుమర్తి చందర్‌రావు ఎమ్మెల్యే రాగమయికి చేసిన విజ్ఞాపన మేరకు స్పందించి ఆయా కేంద్రాలను ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. వాటికి సంబంధించి తగిన స్థల ఏర్పాట్లు, సామాగ్రి సిద్ధం చేయడం, కొనుగోలు కమిటీల సభ్యులు పాటించాల్సిన నియమ నిబంధనలపై మెప్మా మిషన్ కోఆర్డినేటర్ సుజాత తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆర్ఐ ఉమామహేశ్వరరావు, గ్రామ పరిపాలన అధికారి సురేష్, రైతులు బుర్రి వీరయ్య, కిష్టం శెట్టి కొండలరావు, పెద్దబోయిన నరిసింహారావు, కల్లూరు రైతులు బాలనాగేశ్వరరావు, కుంచాల గురవయ్య పాల్గొన్నారు.

కార్తీకమాస అన్నప్రసాద వితరణ ప్రారంభం

ఎర్రుపాలెం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమలాపురం గ్రామంలో గల శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి సమీపంలో గల శ్రీ వెంకటేశ్వర అన్నదాన సేవా సమితిఆధ్వర్యంలో కార్తీకమాసం ఉచిత అన్నవితరణ కార్యక్రమాన్ని కేఎస్ఆర్ గ్రానైట్స్ అధినేత తుళ్లూరు నిర్మల కుమారి శనివారం ప్రారంభించారు. శ్రీవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రతి శనివారం సేవాసమితి ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఉచితంగా అన్నదానం నిర్వహిస్తారు. కార్తీకమాసంలో రాలయంలో భక్తుల సందడితోపాటు, అయయప్ప, భవాని, గోవిందమాలల దీక్షదారుల కోసం నెలరోజుల పాటు అపరిమితంగా ఉచితంగా అన్నవితరణ చేస్తున్నామని సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. కార్తీకమాసంలో అన్నదానం చేయడం శుభప్రదమని, సేవాసమితి చేస్తున్న కార్యక్రమాలకు తాను అన్నివిధాల సహకారం అదించేందుకు సిద్ధంగా ఉంటనని నిర్మలకుమారి తెలిపారు. సేవా సమితి నిర్వాహకులు ఎల్‌వీ నారాయణరెడ్డి, లీలా కృష్ణ, విష్ణుమూర్తి, శ్రీనివాసరావు, దాతలు వీరమాచనేని జగదీష్, నాని తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు దుకాణాల తనిఖీ

ఏన్కూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏన్కూరు, తూతక్కలింగన్నపేట గ్రామంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలను వైరా ఏడీఏ కరుణశ్రీ శనివారం తనిఖీచేశారు. ఈసందర్భంగా స్టాక్ రిజిస్టర్లను, ఎరువులు, పురుగుమందులను పరిశీలించారు. అనతరం టీఎల్‌పేట గ్రామంలో మొక్కజొన్న రైతులకు అవగాహన కలిగించారు. మొక్కజన్న సాగుచేసే రైతులు తప్పనిసరిగా ఏజెంట్ల వద్ద నుంచి అగ్రిమెంట్ బాండ్ తీసుకోవాలని తెలిపారు. పత్తి రతులు సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించాలన్నారు. మధ్యదళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఏవో నరసింహారావు, భవ్యశ్రీ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ స్థలాన్ని పరిశీలించిన అధికారులు

మధిర రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని మడుపల్లి గ్రామంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సహకారంతో రూ.3కోట్లతో చేపట్టనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని శనివారం ట్రాన్స్‌కో మధిర టౌన్ ఏఈ అనిల్‌కుమార్, కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పరిశీలించారు.

కపాస్ కిసాన్‌యాప్‌పై అవగాహన

చింతకాని, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రత్తి పండించే ప్రతి రైతు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కలిగిఉండాలని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో యాప్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఏఈవోల దగ్గర వివరాలు నమోదు చేసుకోవాలన్నారు.